



'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

అక్షర **రాజముద్ర**

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAMUDHRA | RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | బుధవారం | 06.05.2026 | సంపుటి: 3 | సంచిక: 94 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | WEDNESDAY | 06.05.2026 | VOLUME : 3 | ISSUE : 94 | PAGES: 8 | COST: 2/- |



## విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575




## ఆ కుర్రాడు.. డీఎంకే కోటను కూల్చాడు!

- తలపతి చిన్ననాటి ఫోటో ఇప్పుడు సోషల్ మీడియాలో ట్రెండింగ్
- ఆర్జీవీ పోస్ట్‌పై దేశవ్యాప్త చర్చ
- స్టాలిన్ సొంత గడ్డపైనే విజయ్ సునామీ
- ఒక్క ఫోటో.. వేల కథనాలు

2



2

## ప్రముఖ నిర్మాత ఆర్‌బీ చౌదరి కన్నుమూత

- రాజస్థాన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదం
- సూపర్ గుడ్ ఫిలింస్ అధినేత దుర్మరణం
- నాలుగు భాషల్లో 90కి పైగా చిత్రాల నిర్మాణం..
- 'రాజా', 'సూర్యవంశం' వంటి హిట్లతో గుర్తింపు
- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం చంద్రబాబు, పవన్ కళ్యాణ్, చిరంజీవి, బాలకృష్ణ



# ప్రాంతీయ వాదం వీడితే
# పతనమేనా?

ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు నిదర్శనమా?

జాతీయ రాజకీయాల్లో వేలు పెట్టే ప్రాంతీయ పార్టీలకు గుణపాఠమా?

స్టాలిన్, మమతల ఓటమే తాజా సాక్ష్యం .. ఇతర పార్టీలు నేర్చుకుంటాయా?

**రాజముద్ర న్యూస్, నేషనల్ బ్యూరో:**

ప్రాంతీయ పార్టీల మనుగడకు సంబంధించి భారత రాజకీయాల్లో ఇప్పుడు ఒక కొత్త చర్చ మొదలైంది. సొంత రాష్ట్రం వదిలి జాతీయ ఆకాశంలోకి ఎగరాలనుకోవడం.. రెక్కలు విరగ్గొట్టుకోవడమేనా అనే ప్రశ్నకు ప్రస్తుత ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు అవుననే సమాధానం ఇస్తున్నాయి. రాష్ట్ర రాజకీయాల్లో తిరుగులేని నాయకులుగా వెలుగొందుతూ, ఎప్పుడైతే వారు జాతీయ రాజకీయాలపై కన్నేశారో, అప్పుడే వారి సొంత కోటలు కూలిపోవడం ప్రారంభమవుతున్నాయి. ఈ పరిణామాన్ని విశ్లేషిస్తే ప్రాంతీయ పార్టీల వైఫల్యాల వెనుక ఉన్న నేషనల్ అంబిషన్ స్పష్టంగా కనిపిస్తుంది.

**చంద్రబాబు పాఠం..**

**సరిదిద్దుకున్న వ్యూహం**

గతంలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు 201819 సమయంలో జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పాలని ప్రయత్నించి, సొంత రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో ఘోర పరాజయాన్ని చవిచూశారు. జాతీయ స్థాయిలో కూటములను

మిగతా 2వ పేజీలో..

## శంషాబాద్‌లో ఐటీపీ ఏరో ఇండియా
## కేంద్రానికి శ్రీకారం..

**రూ.453 కోట్ల పెట్టుబడితో హార్డ్‌వేర్ పార్క్‌లో కొత్త ప్రాజెక్ట్**

- ఏరోస్పేస్ రంగానికి ఊతం, గ్లోబల్ హబ్ దిశగా అడుగు
- వందలాది ఉద్యోగాలకు అవకాశాలు
- 2027 నాటికి కార్యకలాపాలు ప్రారంభం

**హైదరాబాద్, మే 5:**

తెలంగాణలో పారిశ్రామిక అభివృద్ధికి మరో కీలక ముందడుగు పడింది. శంషాబాద్ హార్డ్‌వేర్ పార్క్ మూడో దశలో ఐటీపీ ఏరో ఇండియా తయారీ కేంద్రానికి శంకుస్థాపన చేశారు.

రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఈ కార్యక్రమానికి హాజరై పనులను

మిగతా 2వ పేజీలో..



## రైతు సమస్యలపై ప్రభుత్వానికి
## కేటీఆర్ అల్టిమేటం

జనగామలో కేటీఆర్ పర్యటన.. బీఆర్ఎస్ శ్రేణుల స్వాగతం

యశ్వంతపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

కొనుగోలు జాప్యంపై రైతుల ఆవేదన..

మార్క్‌ఫెడ్‌కు కేటీఆర్ ఫోన్

3



## యూరియా అమ్మకాలపై
## ఆంక్షలు దారుణం..

హరీష్ రావు ఫైర్

రైతాంగం ఇబ్బందులు..

సరఫరా నిలిపివేతపై విమర్శలు

'రైతు డిక్లరేషన్' హామీలు విఫలం అంటూ ఆరోపణలు

ఆంక్షలు ఎత్తివేయాలని ప్రభుత్వానికి డిమాండ్



**రాజముద్ర న్యూస్, హైదరాబాద్**

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా యూరియా అమ్మకాలపై కాంగ్రెస్ ప్రభుత్వం ఆంక్షలు విధించడాన్ని నిరసిస్తూ మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రభుత్వ నిర్ణయం వల్ల రైతాంగం ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రస్తావిస్తూ

మిగతా 2వ పేజీలో..

## జహీరాబాద్ స్మార్ట్ ఇండస్ట్రియల్ సిటీకి శ్రీకారం

- మోదీ చేతుల మీదుగా మే 10న శంకుస్థాపన
- రూ.2360 కోట్లతో భారీ పారిశ్రామిక ప్రాజెక్ట్
- లక్షల ఉద్యోగాలకు నాంది, భారీ పెట్టుబడుల లక్ష్యం
- హైదరాబాద్–నాగ్‌పూర్ కారిడార్‌లో కీలక అభివృద్ధి



**రాజముద్ర న్యూస్, హైదరాబాద్**

తెలంగాణలో పారిశ్రామిక రంగానికి భారీ ఊతం ఇవ్వనున్న జహీరాబాద్ ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్‌కు మే 10న ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేయనున్నారు. కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డి ఈ విషయాన్ని వెల్లడించారు.

మిగతా 2వ పేజీలో..

## అర్హతే ప్రామాణికం..

- మూడు నెలల్లో పరిష్కారం:పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- ప్రజాదర్బార్ వేదికగా సమస్యల పరిష్కారానికి అభయం
- సాదాబైనామాలకు 35 రోజుల్లోనే మోక్షం
- ప్రభుత్వ భూమిని కాజేస్తే సహించేది లేదు



**రాజముద్ర న్యూస్, ఖమ్మం**

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ తొలి ప్రాధాన్యమని, అర్హత ఉన్న ప్రతి దరఖాస్తుకు మూడు నెలల్లోపు పరిష్కారం చూపుతామని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం ఖమ్మం రూరల్

మిగతా 2వ పేజీలో..



## తెలంగాణ ప్రజల రక్షణ కోసమే టిఆర్ఎస్

టిఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట కవిత

తెలంగాణ ప్రజల రక్షణే మా పార్టీ ధ్యేయం

ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతాం

3

## నిజాంపేట్‌లో
## భారీ అగ్నిప్రమాదం..

- ఆరు ఫర్నిచర్ షాపులు దగ్ధం!
- వరుస ఘటనలతో టెన్షన్!

**రాజముద్ర న్యూస్, హైదరాబాద్**

మేడ్చల్ జిల్లాలోని బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. నిజాంపేట్ సర్కిల్‌లో సోమవారం

మిగతా 2వ పేజీలో..



## కరీంనగర్ బంగారం షాపు చోరీ

- ధర్మపురి లాడ్జిలో దొంగల బస
- సీసీ టీవీ ఫుటేజ్ ఆధారంగా దొంగలను గుర్తించే పనిలో పోలీసులు

3

## రెవెన్యూ శాఖలో భారీగా బదిలీలు..

27 మంది అధికారులకు స్థానచలనం

2

## గుంటూరు ముఠా హనీట్రాప్ అరాచకాలు..

- ఇన్‌స్టాగ్రామ్ వేదికగా రిచ్ కిడ్స్ టార్గెట్
- మైనర్ బాలికలను వలలో వేసిన అన్నదమ్ములు
- లైంగిక వేధింపులు, వీడియోలతో బ్లాక్ మెయిల్
- రూ.13 లక్షలు దోచుకున్న ముఠా

**రాజముద్ర న్యూస్, హైదరాబాద్**

మహానగరంలో ఇన్‌స్టాగ్రామ్ వేదికగా మైనర్ బాలికలను టార్గెట్ చేస్తూ హనీట్రాప్‌కు పాల్పడుతున్న గుంటూరు ముఠా అరాచకాలు వెలుగులోకి వచ్చాయి. రిచ్ కిడ్స్‌ను లక్ష్యంగా చేసుకుని వల వేస్తున్న ఇద్దరు అన్నదమ్ములను పోలీసులు అరెస్ట్ చేశారు.

గుంటూరుకు చెందిన అర్జున్ (అలియాస్ చంద్రశేఖర్ ఆజాద్), ప్రవీణ్ ఈ దారుణాలకు పాల్పడుతున్నట్లు విచారణలో తేలింది. వీరికి వారి తల్లి మీనాకుమారి సహకారం


మిగతా 2వ పేజీలో..



## యూరియా అమ్మకాలపై ఆంక్షలు దారుణం..

మొదటిపేజీ తరువాయి

ఆయన ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఘాటైన విమర్శలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా యూరియా అమ్మకాలపై ఆంక్షలు విధించడం అత్యంత దిక్కుమాలిన చర్య అని హరీష్ రావు మండిపడ్డారు. గతంలో ఎన్నడూ లేని విధంగా యూరియాపై ఇలాంటి ఆంక్షలు విధించడం ప్రస్తుత ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు నిదర్శనమని ఆయన ఆరోపించారు. ఎరువుల ధరలు పెరగడం ఒకవైపు, యూరియా సరఫరా నిలిపివేయడం మరోవైపు రైతులను తీవ్రంగా ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా చెరకు, పండ్ల తోటలు, కూరగాయలు పండించే రైతులు ఈ సరఫరా నిలిపివేతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ముందు 'రైతు డిక్లరేషన్' పేరిట అనేక హామీలను ఇచ్చిందని, అయితే వాటిని నెరవేర్చడంలో ఇప్పుడు పూర్తిగా విఫలమైందని హరీష్ రావు విమర్శించారు. రైతుబంధు, పంటలకు బోనస్ చెల్లింపు, రుణమాఫీ, పంట భీమా వంటి కీలకమైన వాగ్దానాలను అమలు చేయడంలో ప్రభుత్వం అట్టర్ ఫ్లాప్ అయిందని ఆయన ఎద్దేవా చేశారు. రైతుల కష్టాలను తీర్చాల్సింది పోయి, సమస్యలను మరింత జటిలం చేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. యూరియా కొరతను పరిష్కరించడంపై దృష్టి పెట్టాల్సిన ప్రభుత్వం, రైతులకు యూరియా వినియోగం తగ్గించాలని సూచించడం హాస్యాస్పదంగా ఉందని హరీష్ రావు విమర్శించారు. ఇటువంటి వింత సూచనలు చేయడం మానేసి, ప్రభుత్వం తక్షణమే ఈ అనాధికారిక నిషేధాన్ని ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని మునుపటిలాగే ఎటువంటి ఆంక్షలు లేకుండా యూరియా అమ్మకాలను కొనసాగించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.





## ప్రముఖ నిర్మాత ఆర్‌బీ చౌదరి కన్నుమూత

- చిత్ర పరిశ్రమలో తీరని విషాదం
- రాజస్థాన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదం
- సూపర్ గుడ్ ఫిలింస్ అధినేత దుర్మరణం
- నాలుగు భాషల్లో 90కి పైగా చిత్రాల నిర్మాణం..
- 'రాజా', 'సూర్యవంశం' వంటి హిట్లతో గుర్తింపు
- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం చంద్రబాబు, పవన్ కళ్యాణ్, చిరంజీవి, బాలకృష్ణ

హైదరాబాద్

భారతీయ చలనచిత్ర పరిశ్రమలో తనదైన ముద్ర వేసిన ప్రముఖ సీనియర్ నిర్మాత, సూపర్ గుడ్ ఫిలింస్ అధినేత ఆర్.బి. చౌదరి (72) మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో కన్నుమూశారు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో ఆయన ప్రయాణిస్తున్న వాహనం ప్రమాదానికి గురికావడంతో ఈ విషాదం చోటుచేసుకుంది. ఈ వార్త తెలియగానే దక్షిణ భారత సినీ పరిశ్రమ ఒక్కసారిగా దిగ్భ్రాంతికి లోనైంది. తెలుగు, తమిళ, మలయాళ, హిందీ భాషల్లో సుమారు 90కి పైగా చిత్రాలను నిర్మించిన ఆర్.బి. చౌదరి, ఎందరో నటీనటులను, సాంకేతిక నిపుణులను వెండితెరకు పరిచయం చేశారు. ముఖ్యంగా తెలుగులో 'రాజా', 'సూర్యవంశం', 'సుస్వాగతం' వంటి క్లాసిక్ హిట్లు ఆయన నిర్మాణంలో వచ్చినవే. కేవలం భారీ చిత్రాలే కాకుండా, కుటుంబ కథా చిత్రాలకు పెద్దపీట వేస్తూ 'సూపర్ గుడ్ ఫిలింస్' బ్యానర్‌ను ఇంటి పేరయ్యేలా చేశారు. ఆయన కుమారులు జీవా, రమేష్ కూడా నటులుగా రాణిస్తున్నారు.

**ప్రముఖుల సంతాపం:**

ఆర్.బి. చౌదరి మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణం పరిశ్రమకు తీరని లోటని పేర్కొన్నారు. మెగాస్టార్ చిరంజీవి, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణతో పాటు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఒక గొప్ప నిర్మాతను, మంచి మనిషిని కోల్పోయామని సినీ లోకం నివాళులర్పిస్తోంది.

## నిజాంపేట్‌లో భారీ అగ్నిప్రమాదం..

మొదటిపేజీ తరువాయి

అర్ధరాత్రి వేళ ఈ ఘటన జరిగింది. ఈ అగ్నిప్రమాదంలో వరుసగా ఉన్న ఆరు ఫర్నిచర్ షాపులు మంటల్లో పూర్తిగా కాలి బూడిదయ్యాయి. దుకాణాల్లో నిల్వ ఉంచిన భారీ ఫర్నిచర్ సామాగ్రి అగ్నికి ఆహుతి కావడంతో సుమారు లక్షల రూపాయల ఆస్తి నష్టం వాటిల్లిందని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న వెంటనే 4 ఫైరింజన్లు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. అగ్నిమాపక సిబ్బంది, స్థానిక పోలీసులు సమన్వయంతో గంటల తరబడి శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. షార్ట్ సర్క్యూట్ వల్లే ఈ మంటలు చెలరేగి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. అదృష్టవశాత్తూ ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి ప్రాణహాని కలగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.



అయితే, ఇటీవల కాలంలోనే ఇదే ప్రాంతంలో మరో అగ్నిప్రమాదం జరగడం, మళ్లీ ఇప్పుడు ఇలాంటి ఘటనే జరగడంతో స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ అగ్నిప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలను తెలుసుకోవడానికి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు ప్రతి వేసవికాలంలో ఇదే తీరుగా నగరంలో ఏదో చోట తరచుగా అగ్నిప్రమాదాలు సంభవిస్తున్నాయి.

## గుంటూరు ముఠా హనీట్రాప్ అరాచకాలు..

మొదటిపేజీ తరువాయి

కూడా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆకర్షణీయ రీల్స్ చేస్తూ మైనర్ బాలికలను పరిచయం చేసుకుని, ఖరీదైన కార్లు, విలాసవంతమైన జీవనశైలితో ఆకట్టుకుని వారిని వలలో వేస్తున్నారు.

బాలికలను కార్లలో తీసుకెళ్లి లైంగిక వేధింపులకు పాల్పడుతూ, ఆ దృశ్యాలను రహస్యంగా చిత్రీకరించి తర్వాత వాటితో బ్లాక్ మెయిల్ చేస్తున్నట్లు వెల్లడైంది. పెట్టుబడుల పేరుతో డబ్బులు వసూలు చేస్తూ బెదిరింపులకు దిగుతున్నారు. ఈ క్రమంలో ఒక మైనర్ బాలిక నుంచి రూ.13 లక్షలు దోచుకున్నట్లు పోలీసులు తెలిపారు.ఇప్పటివరకు సుమారు 19 మంది మైనర్ బాలికలను ఈ ముఠా ట్రాప్ చేసినట్లు గుర్తించారు. నిందితుడి ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను పోలీసులు నిలిపివేశారు. కేసు తీవ్రత దృష్ట్యా ఉన్నతాధికారులు స్వయంగా విచారణ చేపట్టి మరిన్ని వివరాలు సేకరిస్తున్నారు.ఈ ఘటనతో నగరంలో కలకలం రేగింది. నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు.

# ప్రాంతీయ వాదం వీడితే పతనమేనా?

మొదటిపేజీ తరువాయి

కలపడంపై పెట్టిన దృష్టి, క్షేత్రస్థాయిలో ప్రజల నాడిని పట్టుకోవడంలో విఫలమయ్యేలా చేసింది. అయితే, ఆ తప్పును గుర్తించిన ఆయన, మళ్ళీ లోకల్ పాలిటిక్స్‌కే పరిమితమై, బీజేపీతో వ్యూహాత్మక పొత్తు పెట్టుకుని అధికారాన్ని దక్కించుకోవడం ఒక రాజకీయ పాఠం. ప్రాంతీయ నేతలకు రాష్ట్ర ప్రయోజనాలే ప్రథమ ప్రాధాన్యత అని ఆయన నిరూపించారు.

**టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్ వరకు - కేసీఆర్ పతనం**

తెలంగాణలో తిరుగులేని శక్తిగా ఉన్న కేసీఆర్, తన పార్టీ పేరును టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్‌గా మార్చి జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశించడమే ఆయన పతనానికి ఆరంభమైంది. అబ్ కీ బార్ కిసాన్ సర్కార్ అంటూ మహారాష్ట్ర, ఇతర రాష్ట్రాలపై ఫోకస్ పెట్టడం వల్ల, తెలంగాణ ప్రజల్లో తమ సమస్యలను పక్కనపెట్టి ఇతర రాష్ట్రాలకు వెళ్తున్నారు అనే భావన కలిగింది. ఫలితంగా పదేళ్ల అధికారాన్ని కోల్పోవడమే కాకుండా, లోక్ సభ ఎన్నికల్లో జీరోకి పరిమితమవడంతో పార్టీ ఉనికి ప్రశ్నార్థకంగా మారింది.

**కేజ్రీవాల్ , ఠాక్రే - గందరగోళంలో కోటలు**

ఢిల్లీకే పరిమితమైన ఆమ్ ఆద్మీ పార్టీని దేశవ్యాప్తంగా విస్తరించాలని అరవింద్ కేజ్రీవాల్ పడ్డ తాపత్రయం ఆయనను జైలు పాలు చేయడమే కాకుండా, పార్టీలో సంక్షోభానికి దారితీసింది. పంజాబ్ లో గెలిచినప్పటికీ, ఇతర రాష్ట్రాల్లో విస్తరణ ప్రయత్నాలు ఢిల్లీ పాలనపై ప్రభావం చూపాయి. అటు మహారాష్ట్రలో శివసేనను జాతీయ స్థాయిలో సెక్యులర్ ఇమేజ్ కోసం మలచాలని చూసిన ఉద్ధవ్ ఠాక్రే, తన సొంత పార్టీని, ఎమ్మెల్యేలను కాపాడుకోలేకపోయారు. ఇప్పుడు అక్కడ షిండే వర్గం , బీజేపీ హవా ముందు ఠాక్రే వారసత్వం వెలవెలబోతోంది.

**మమత , స్టాలిన్ - బెంగాల్, తమిళనాడు షాక్**

ఇప్పుడు మమతా బెనర్జీ , ఎం.కె. స్టాలిన్ ఎదుర్కొన్న పరాజయం ఈ వాదనకు బలాన్నిస్తోంది. మమత గత రెండేళ్లుగా ఇండియా కూటమికి నాయకత్వం వహించాలని, త్రిపుర, గోవా వంటి రాష్ట్రాల్లో పోటీ చేయాలని చేసిన ప్రయత్నాలు బెంగాల్ పై ఆమె పట్టును సడలించాయి. స్టాలిన్ సైతం జాతీయ స్థాయిలో మోదీకి వ్యతిరేక గళం వినిపిస్తూ, ద్రవిడ మోడల్ ను దేశమంతా ప్రచారం చేయాలని చూశారు. కానీ, ప్రజలు తమ రాష్ట్రంలో ఉన్న సమస్యలను పరిష్కరించని నాయకులు జాతీయ రాజకీయాల గురించి మాట్లాడటాన్ని అంగీకరించడం లేదని ఈ ఫలితాలు తేల్చిచెప్పాయి.

**వాక్యూమ్ ను భర్తీ చేస్తున్న జాతీయ పార్టీలు**

ప్రాంతీయ నేతలు తమ దృష్టిని రాష్ట్రం దాటించిన ప్రతిసారీ, అక్కడ ఒక రాజకీయ శూన్యం ఏర్పడుతోంది. బెంగాల్ లో మమత సృష్టించిన ఆ శూన్యాన్ని బీజేపీ సమర్థవంతంగా భర్తీ చేసింది. తమిళనాడులో స్టాలిన్ వదిలేసిన ప్రాంతీయ సెంటిమెంట్ ను విజయ్ తన తమిళగ వెట్రి కళగం ద్వారా సొంతం చేసుకున్నారు. ప్రాంతీయ పార్టీలు తమ మౌలిక సిద్ధాంతాలను, స్థానిక ప్రజల అవసరాలను విస్మరించి జాతీయ నాయకులుగా ఎదగాలని కోరుకోవడం వల్ల.. అటు జాతీయ స్థాయిలో స్థానం దక్కక, ఇటు సొంత రాష్ట్రంలో అధికారం కోల్పోయే పెనం మీద నుండి పొయ్యిలో పడ్డ చందంగా మారుతున్నాయి.

# అర్హతే ప్రామాణికం..

మొదటిపేజీ తరువాయి

మండలం మంగళగూడెం గ్రామంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి ఆయన పాల్గొని, బాధితుల నుంచి స్వయంగా విన్నపాలను స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్ తెచ్చిన తంటాలతో రైతులు పడుతున్న ఇబ్బందులను తాము భూ భారతి ద్వారా తొలగిస్తున్నామని తెలిపారు.ముఖ్యంగా సాదాబైనామా దరఖాస్తులను అర్హత మేరకు రాబోయే 35 రోజుల్లో పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. అయితే, సాదాబైనామా పేరుతో ప్రభుత్వ భూములను కాజేయాలని చూస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని, అటువంటి దరఖాస్తులను తిరస్కరిస్తామని గట్టిగా హెచ్చరించారు.



**ప్రజల ముంగిటకే ప్రజా పాలన**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదలు, మహిళలు, నిరుద్యోగ యువత పక్షాన ప్రభుత్వం నిలబడుతుందని మంత్రి పొంగులేటి పునరుద్ఘాటించారు. ఇప్పటి వరకు నిర్వహించిన 7 క్లస్టర్ల పరిధిలో వచ్చిన పది వేల దరఖాస్తులలో 5 వేల వరకు ఇందిరమ్మ ఇళ్ల కోసమే రావడం ప్రజల అవసరాన్ని సూచిస్తోందని, వీటిని ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని తెలిపారు. గ్రామాల్లో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ లైన్ల తొలగింపు, కొత్త రేషన్ కార్డుల మంజూరు, రూ. 500లకే గ్యాస్ సిలిండర్ వంటి పథకాలు అర్హులైన ప్రతి పేదవాడికి అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డి, ఆర్డీఓ శ్రీనివాస్ , వివిధ శాఖల అధికారులు, ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.





## శంషాబాద్‌లో ఐటీపీ ఏరో ఇండియా కేంద్రానికి శ్రీకారం..

మొదటిపేజీ తరువాయి

ప్రారంభించారు. సుమారు రూ.453 కోట్ల పెట్టుబడితో 10 ఎకరాల్లో ఈ ప్రాజెక్ట్ నిర్మాణం చేపడుతున్నారు. తెలంగాణను ఏరోస్పేస్, ఆధునిక తయారీ రంగాల్లో గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా ఇది కీలక అడుగుగా అధికారులు పేర్కొన్నారు. ఈ తయారీ కేంద్రం 2027 నాటికి పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించనుంది. ప్రారంభ దశలోనే సుమారు 350 మంది నైపుణ్య ఉద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించనుండగా, తరువాతి దశల్లో ఈ సంఖ్య దాదాపు 600కు చేరే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

ప్రెసిషన్ ఇంజినీరింగ్, ఆధునిక తయారీ, నాణ్యత నియంత్రణ వంటి విభాగాల్లో ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. రాష్ట్ర యువతకు ఉన్నత స్థాయి ఉపాధి అవకాశాలు కల్పించడంలో ఈ ప్రాజెక్ట్ కీలకంగా మారనుందని ప్రభుత్వం భావిస్తోంది.

పారిశ్రామిక పెట్టుబడులను ఆకర్షిస్తూ సాంకేతికతను ప్రోత్సహిస్తున్నామని మంత్రి తెలిపారు. ఇలాంటి ప్రాజెక్టులు రాష్ట్ర ఆర్థిక వృద్ధికి తోడ్పడతాయని పేర్కొన్నారు. తెలంగాణను పెట్టుబడులకు అనుకూల రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఆ కుర్రాడు.. డీఎంకే కోటను కూల్చాడు!

- తలపతి చిన్ననాటి ఫోటో ఇప్పుడు సోషల్ మీడియాలో ట్రెండింగ్
- ఆర్జీవీ పోస్ట్ పై దేశవ్యాప్త చర్చ
- ఒక్క ఫోటో.. వేల కథనాలు

తెలంగాణ బ్యూరో

ఒక ఫోటో వెయ్యి పదాలతో సమానం అంటారు.. కానీ ఇప్పుడు ఒక ఫోటో దేశ రాజకీయాల్లో లక్షలాది కథనాలకు కేంద్ర బిందువైంది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో తమిళగ వెట్రి కళగం పార్టీతో నటుడు విజయ్ సృష్టించిన రాజకీయ సునామీ ఇప్పుడు దేశవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. ఈ నేపథ్యంలో సంచలన దర్శకుడు రాంగోపాల్ వర్మ చేసిన ఒక ట్వీట్ ఇప్పుడు సోషల్ మీడియాను ఊపేస్తోంది. అప్పట్లో డీఎంకే అధినేత, దివంగత ముఖ్యమంత్రి కరుణానిధి వెనుక ఒక సాధారణ కుర్రాడిగా నిలబడి ఉన్న విజయ్ ఫోటోను వర్మ షేర్ చేశారు. కరుణానిధి వెనుక కనిపిస్తున్న ఈ కుర్రాడు భవిష్యత్తులో అదే పార్టీని ఓడిస్తారని ఎవరైనా ఊహించారా? కరుణానిధి కుమారుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి స్టాలిన్.. ఈ కుర్రాడి రాజకీయ ప్రభంజనంలో తన సొంత నియోజకవర్గంలోనే ఓటమి పాలవుతారని ఎవరైనా అనుకున్నారా? అంటూ వర్మ తనదైన శైలిలో కామెంట్స్ చేశారు.

**రాజకీయ ముఖచిత్రం మార్చిన విజయ్**

తమిళనాడు ఎన్నికల్లో మొదటి ప్రయత్నంలోనే టీవీకే 108 స్థానాలను కైవసం చేసుకోవడం, ఏకంగా అధికార డీఎంకేకు చుక్కలు చూపడం ఇప్పుడు జాతీయ రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. ముఖ్యంగా స్టాలిన్ వంటి దిగ్గజ నేతలే విజయ్ ధాటికి తలవంచాల్సి రావడం విశేషం. అప్పట్లో కరుణానిధితో దిగిన ఆ చిన్ననాటి ఫోటో ఇప్పుడు విజయ్ సాధించిన విజయానికి ప్రతీకగా నిలుస్తోంది. నెటిజన్లు ఆ ఫోటోను వైరల్ చేస్తూ, కాలం ఎంత విచిత్రమైనదోనని కామెంట్లతో హోరెత్తిస్తున్నారు.



## జహీరాబాద్ స్మార్ట్ ఇండస్ట్రియల్ సిటీకి శ్రీకారం..

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్-నాగ్‌పూర్ పారిశ్రామిక కారిడార్‌లో భాగంగా రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్ మొత్తం రూ.2360.54 కోట్ల వ్యయంతో అమలు కానుంది. సుమారు 3,245 ఎకరాల్లో విస్తరించనున్న ఈ స్మార్ట్ సిటీ ఆధునిక మౌలిక వసతులతో కూడిన సమగ్ర పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చెందనుంది.

ఈ ప్రాజెక్ట్ ద్వారా రూ.10,000 కోట్లకు పైగా పెట్టుబడులు ఆకర్షించే అవకాశముందని అంచనా వేస్తున్నారు. 2029 నాటికి దాదాపు 1.74 లక్షల ఉద్యోగాలు సృష్టించబడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

లాజిస్టిక్స్, ఆటో భాగాలు, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, యంత్రాలు, లోహాలు, ఆహార ప్రాసెసింగ్ వంటి రంగాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వనున్నారు. స్మార్ట్ టెక్నాలజీతో కూడిన మౌలిక వసతులు, పర్యావరణ హిత అభివృద్ధి విధానాలు ఈ ప్రాజెక్ట్ ప్రత్యేకతగా నిలవనున్నాయి. ప్లగ్అండ్‌ప్లే పారిశ్రామిక సదుపాయాలతో పాటు నివాస, వాణిజ్య ప్రాంతాలు, పాఠశాలలు, శిక్షణ కేంద్రాలు వంటి సమగ్ర వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు.

వ్యూహాత్మకంగా హైదరాబాద్-నాగ్‌పూర్ కారిడార్‌లో ఉన్న ఈ ప్రాంతం భవిష్యత్తులో ప్రధాన తయారీ, లాజిస్టిక్స్ హబ్‌గా మారనుందని నిపుణులు భావిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ తెలంగాణ ఆర్థికాభివృద్ధికి కీలకంగా మారనుంది

## ఢిల్లీ పర్యటనకు సీఎం రేవంత్ రెడ్డి

- మెట్రో ఫేజ్-2పై దృష్టి
- కేంద్ర అనుమతుల కోసం కీలక భేటీలు
- పెండింగ్ ప్రాజెక్టులు, నిధులపై విజ్ఞప్తి
- జాతీయ రాజకీయాలపై కూడా చర్చల సూచనలు

**హైదరాబాద్, మే 5 :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రేపు ఉదయం ఢిల్లీ పర్యటనకు వెళ్లనున్నారు. ఈ పర్యటనలో ప్రధానంగా హైదరాబాద్ మెట్రో ఫేజ్2 ప్రాజెక్టుకు అవసరమైన కేంద్ర అనుమతులపై ఆయన దృష్టి సారించనున్నట్లు సమాచారం. ఢిల్లీలో కేంద్ర మంత్రులతో సమావేశమై రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పెండింగ్ ప్రాజెక్టులు, సంక్షేమ పథకాలకు అందాల్సిన నిధులపై ముఖ్యమంత్రి విజ్ఞప్తులు చేయనున్నారు. ముఖ్యంగా మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించిన ప్రాజెక్టులను వేగవంతం చేయాలనే అంశంపై చర్చించనున్నట్లు తెలుస్తోంది. పాలనాపరమైన అంశాలతో పాటు జాతీయ రాజకీయాలపైనా ఈ పర్యటనలో చర్చలు జరిగే అవకాశం ఉంది. ఏఐసీసీ అగ్ర నేతలతో సీఎం సమావేశమై తాజా రాజకీయ పరిస్థితులపై అభిప్రాయాలు పంచుకోనున్నారు. ఇటీవల కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమి సాధించిన విజయంతో ఈ పర్యటనకు మరింత ప్రాధాన్యత ఏర్పడింది. కేరళ ఎన్నికల ప్రచారంలో రేవంత్ రెడ్డి కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం కేరళ ముఖ్యమంత్రి ఎంపికపై ఉత్కంఠ కొనసాగుతుండగా, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ పేరు బలంగా వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఢిల్లీ పర్యటనలో కేరళ రాజకీయ పరిణామాలపై కూడా చర్చ జరిగే అవకాశాలు ఉన్నాయని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఈ పర్యటన రాష్ట్రానికి అవసరమైన అనుమతులు, నిధుల సాధనలో కీలకంగా మారుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

# తెలంగాణ ప్రజల రక్షణ కోసమే టిఆర్‌ఎస్

- టిఆర్‌ఎస్ అధినేత్రి కల్వకుంట కవిత
- తెలంగాణ ప్రజల రక్షణే మా పార్టీ ద్యేయం
- ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతాం

**తెలంగాణ బ్యూరో**

తెలంగాణ ప్రజల రక్షణ కోసమే టిఆర్‌ఎస్ పార్టీ పుట్టిందని పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు.సిద్ధిపేట జిల్లా మోతే గ్రామంలోని పురాతన రాములవారి ఆలయంలో మంగళవారం రాత్రి, పార్టీ జెండా,,కండువాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా కవిత మాట్లాడారు.రాములవారి దయతో తెలంగాణ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.మా పార్టీ నిరంతరం తెలంగాణ ప్రజల సేవలో నిమగ్నమై ఉండాలని స్వామివారిని కోరుకున్నారని చెప్పారు.ఉచిత విద్యా,వైద్యం,తో పాటు సామాజిక న్యాయంకోసం మేము కృషిచేస్తామని ప్రకటించారు.తెలంగాణ ప్రజలు,యువకులు,మహిళల హక్కులకోసం కృషిచేస్తామని ప్రకటించారు.అంతకుముందు గజ్వేల్ నియోజకవర్గంలోకి పలుగుగడ్డ పెద్దమ్మ తల్లిని దర్శించుకున్నారు.

# రైతు సమస్యలపై ప్రభుత్వానికి కేటీఆర్ అల్టిమేటం

**జనగామ:**

రైతు సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. జనగామ పర్యటనలో భాగంగా యశ్వంతపూర్ గ్రామంలోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన ఆయన, రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.
ధాన్యం కొనుగోలులో 15-20 రోజులుగా జాప్యం జరుగుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై మార్క్‌ఫెడ్ ఎండీ శ్రీనివాస్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడిన కేటీఆర్, కొనుగోళ్లను వేగవంతం చేయాలని సూచించారు.
రాష్ట్రంలో 14 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న పండించినా, కొనుగోలు ప్రణాళికలు సరిపడా లేవని ఆరోపించారు. కేవలం 10 లక్షల టన్నుల కొనుగోలుతో మిగతా పంటను నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. ఆలస్యం వల్ల వర్షాలకు పంట దెబ్బతిని రైతులు నష్టపోతున్నారని చెప్పారు.
మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వం భారీ అప్పులు తెచ్చిందని, సివిల్ సప్లైలో సమస్యలతో నిధుల వినియోగం మారిందని పేర్కొన్నారు. సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే రైతుల తరఫున పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు.



# మక్తల్‌లో కృష్ణ జింకల వేట కలకలం

- ముగ్గురు నిందితుల అరెస్ట్..
- ఆయుధాల స్వాధీనం
- 12 జింకలు, 4 నెమళ్ల హత్య బయటపడ్డ నిజాలు
- వన్యప్రాణుల సంరక్షణపై టాస్క్ ఫోర్స్ కఠిన నిఘా

**మక్తల్, మే 5:**

నారాయణపేట జిల్లా మక్తల్ ప్రాంతంలో వన్యప్రాణుల వేట కలకలం రేపింది. కృష్ణ జింకలను వేటాడుతున్న ముగ్గురు వ్యక్తులను హైదరాబాద్ టాస్క్ ఫోర్స్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. నిందితుల నుంచి భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. మక్తల్ ప్రాంతంలో జింకలను వేటాడుతున్నారన్న పక్కా సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ వేటలో పాల్గొంటున్న ముగ్గురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి ఒక లైసెన్స్‌డ్ రైఫిల్ తో పాటు 3 ఎయిర్ గన్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. నిందితుల్లో ఇద్దరు హైదరాబాద్‌కు చెందిన వారు కాగా, మరొకరు మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు.
పోలీసుల విచారణలో నిందితులు విస్తుపోయే నిజాలను అంగీకరించారు. ఇప్పటివరకు తాము 12 కృష్ణ జింకలను, 4 నెమళ్లను కాల్చి చంపినట్లు నిందితులు ఒప్పుకున్నారు. కేవలం వినోదం కోసమో లేదా ఇతర అవసరాల కోసమో ఈ మూగజీవాలను బలితీసుకున్నట్లు తెలుస్తోంది. వన్యప్రాణుల సంరక్షణ కోసం పోలీసులు గట్టి నిఘా ఉంచారు. హైదరాబాద్ టాస్క్ ఫోర్స్ పోలీసులు ఈ ఆపరేషన్ నిర్వహించి నిందితులను పట్టుకోవడం గమనార్హం. ప్రస్తుతం ఈ కేసును అటవీ శాఖ అధికారులకు అప్పగించి, తదుపరి విచారణను వేగవంతం చేశారు. వన్యప్రాణుల వేటకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరిస్తున్నారు.

# చురుకుగా రబీ ధాన్యం సేకరణ

- మిల్లుల వద్ద అన్‌లోడింగ్ పెంచాలి
- ధాన్యం తరలించేందుకు లారీలు పెంచాలి
- నల్లగొండలో ఆకస్మికి పర్యటన చేసిన స్టీఫెన్ రవీంద్ర

**నల్లగొండ, మే 5:**

రబీ ధాన్యం సేకరణలో భాగంగా మిల్లుల వద్ద అన్‌లోడింగ్ పెంచాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఆదేశించారు. అన్‌లోడింగ్ తోపాటు, వెహికల్ రొటేషన్, కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యం తరలించడం,లారీలు, హమాలీలను పెంచాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం ఆయన నల్గొండ జిల్లా, చిట్యాల మండలం, పెద్దకాపర్తి లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెదకాపర్తి కేంద్రానికి ఇప్పటివరకు వచ్చిన దాన్యం వివరాలు, హమాలీలు, ,ట్రక్ షీట్లు, మిల్లుల ట్యాగింగ్ చేసిన వాహనాలు, టార్పాలిన్లు, తదితర వివరాలను జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, కేంద్రం నిర్వాహకుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. కాగా ఇప్పటివరకు ఈ కేంద్రానికి 25 వేల క్వింటాళ్ల దాన్యం వచ్చిందని, ఇందులో 7000 క్వింటాళ్లు కొనుగోలు చేయడం జరిగిందని, ట్యాబ్ ఎంట్రీ కూడా పూర్తి చేశామని, ఇంకా కొనుగోలు కేంద్రంలో 15 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉన్నట్లు అధికారులు వివరించారు. పెదకాపర్తి కేంద్రం పెద్ద సెంటర్ అయినందున అన్ని పెద్ద సెంటర్లలో 10 నుండి 20 వరకు ఎక్స్ట్రా లారీలు ఏర్పాటు చేశామని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సివిల్ సపె□ల్ కమిషనర్ కు వివరించారు. హమాలీల కొరత లేకుండా మిల్లర్లకు ముందే సమాచారం ఇవ్వడం జరిగిందని, ఒక్కొక్క కొనుగోలు కేంద్రంలో 30 వరకు హమాలీలు ఉన్నారని, అదేవిధంగా మిల్లుల్లో సైతం 30 నుండి 35 వరకు హమాలీలను ఉంచడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా పౌరసరఫరాల శాఖ కమిషన్ మాట్లాడుతూ ట్యాబ్ ఎంట్రీ నూటికి నూరు శాతం కావాలని, కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని శుభ్రపరిచేందుకు డ్రయ్యర్లు, శుభ్రపరిచే విధానాలను అడిగి తెలుసుకున్నారు. గన్ని బ్యాగుల వివరాలను, టార్పాలిన్లను అడిగారు. అవసరమైతే ఎక్స్ట్రా టార్పాలిన్లు కొనుగోలు కేంద్రాలలో పెట్టాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. అనంతరం కమిషనర్ వట్టిమర్తిలో ఉన్న సిద్ధార్థ రైస్ ఇండస్ట్రీస్ ను సందర్శించి అక్కడ ఎంత మంది హమాలీలు ఉన్నారని అడగగా 35 మంది ఉన్నారని తెలిపారు. ఆన్ లోడింగ్, వెహికల్ రొటేషన్ పెంచాలని చెప్పారు.అంతేకాక సిస్టం ద్వారా ధాన్యం వివరాల అప□`లోడింగ్ ,ట్యాబ్ ఎంట్రీ వివరాలను ఆయన పరిశీలించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిరోజు ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేస్తున్నామని చెప్పారు. ట్యాబ్ ఎంట్రీ పెండింగ్ ఉన్న కొనుగోలు కేంద్రాలపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలని, మిల్లులలో స్థలం లేకుంటే ఇంటర్మీడియట్ గోడౌన్లకు తరలించాలని, ధాన్యం తరలింపు తో పాటు, మరిన్ని వాహనాలు ఏర్పాటు చేయాలని ట్రాన్స్పోర్ట్ శాఖ డిప్యూటీ కమిషనర్ వాణిని సివిల్ సపె□లెస్ కమీషనర్ ఆదేశించారు. పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ రోహిత్ సింగ్, జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, పౌరసరఫరాల శాఖ జీఎం నాగేశ్వర రావు, ట్రాన్స్పోర్ట్ డిప్యూటీ కమిషనర్ వాణి, పౌరసరఫరాల శాఖ వెంకటేశం జి ఎం. రాంపతి నాయక్, డిసీఓ పత్యా నాయక్, మార్కెటింగ్ శాఖ ఎడి ఛాయాదేవి, చిట్యాల తహసిల్దార్ విజయ్, తదితరులు ఉన్నారు.

# ప్రధాని పర్యటనలో భారీ భద్రత

**హైదరాబాద్, మే 5:**

ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ మే 10వ తెలంగాణలో పర్యటించనున్న నేపథ్యంలో భద్రతా పరంగా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు ఆదేశించారు. అలాగే తగిన భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కడా పొరపాట్లు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రధాని పర్యటన ఏర్పాట్లపై మంగళవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణా రావు సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రధాన మంత్రి పర్యటనకు సంబంధించి జరుగుతున్న ఏర్పాట్ల వివరాలను ఆయన సమీక్షించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పర్యటనలో ప్రధానమంత్రి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. దీంతో పాటు అదేరోజు బహిరంగసభలో పాల్గొననున్నారు. అందుకు అనుగుణంగా బ్లూ బుక్ ప్రకారం తగిన భద్రతా ఏర్పాట్లు, శాంతిభద్రతలు, ట్రాఫిక్, బందోబస్త్ ఏర్పాట్లు చేయాలని పోలీసుశాఖకు ప్రధాన కార్యదర్శి సూచించారు. బేగంపేట్ విమానాశ్రయం, హెలిప్యాడ్‌లతో పాటు అన్ని వేదికల వద్ద తగినన్ని అగ్నిమాపక వాహనాలు ఏర్పాటు చేయాలని ఫైర్ సర్వీసెస్ శాఖ అధికారులను, అవసరమైన వైద్య సదుపాయాలు కూడా ఏర్పాటు చేయాలని, ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. ప్రధానమంత్రి కాన్వాయ్ పర్యటించే మార్గాలలో రోడ్లను పరిశీలించాలని ఏ వైన మరమ్మత్తులు ఉంటే యుద్ధప్రాతిపధికన పూర్తి చేయాలని పోలీసు, ఉఊఓఅ, రోడ్లూ భవణాల శాఖల అధికారులను ఆదేశించారు. ప్రధాని పర్యటించే అన్ని ప్రాంతాల్లో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ శాఖను ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని, ప్రధానమంత్రి పర్యటన విజయవంతంగా జరిగేలా చూడాలని సూచించారు. సమావేశంలో డీజీపీ సీవీ ఆనంద్, స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్ , నవీన్ మిట్టల్, దానకిషోర్, వాణిప్రసాద్, హోంశాఖ ముఖ్య కార్యదర్శి శిఖా గోయల్, ఇంటిలిజెన్స్ అడిషనల్ డిజి అనిల్ కుమార్, హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి పోలీస్ కమిషనర్లు విసి సజ్జనార్, రమేష్ , సుమతి, గ్□ర్ సర్వీసెస్ డీజీ, విక్రమ్ సింగ్ మన్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ ముకుంద రెడ్డి, హైదరాబాద్ వాటర్ వర్క్స్ ఎండి అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ శాఖలో భారీగా బదిలీలు.. 27 మంది అధికారులకు స్థానచలనం

**హైదరాబాద్ మే05**

పరిపాలనా సౌలభ్యం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల్లో విధులు నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్లు, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు, డిప్యూటీ కలెక్టర్లలతో సహా మొత్తం 27 మందిని బదిలీ చేస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ అయ్యాయి. బి.హరిసింగ్ సూర్యాపేట అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా, డి. రాజ్యలక్ష్మి పెద్దపల్లి అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా నియమితులయ్యారు. సంగారెడ్డి అదనపు కలెక్టర్ ఆర్. డీ. మాధురి నల్గొండ ఐ&సీఏడీ (I&CAD) స్పెషల్ కలెక్టర్గా బదిలీ అయ్యారు. టీఎల్. సంగీత సంగారెడ్డి అదనపు కలెక్టర్గా, మధు మోహన్ గద్వాల అదనపు కలెక్టర్గా పదోన్నతి పొంది బదిలీ అయ్యారు. అదేవిధంగా నిజామాబాద్ డీఆర్వోగా బి.గీత, భద్రాద్రి కొత్తగూడెం డీఆర్వోగా ఎస్. పద్మావతి, ఆదిలాబాద్ డీఆర్వోగా బి. స్రవంతి నియమితులయ్యారు. ఎస్.రాజేందర్ రెడ్డి సిరిసిల్ల
ఆర్డీవోగా, ఎం. శర్మిల ఉట్నూర్ ఆర్డీవోగా, ఎం. విజయ కుమారి బోధన్ ఆర్డీవోగా పోస్టింగ్ పొందారు. ఎస్. రమణా రెడ్డి మిర్యాలగూడ ఆర్డీవోగా బదిలీ అయ్యారు. సదరు అధికారులంతా తక్షణమే విధుల్లో చేరాలని, వారు బాధ్యతల నుంచి రిలీవల్ అయిన తేదీ, కొత్త చోట చేరిన వివరాలను ప్రభుత్వానికి తెలియజేయాలని ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నారు. బదిలీ అయిన వారిలో వెయిటింగ్లో ఉన్న వారు, వివిధ శాఖల్లో డెప్యుటేషన్పై ఉన్న వారు కూడా ఉన్నారు. బదిలీ అయిన ఆర్.వీ. రాధాబాయి (డిప్యూటీ కలెక్టర్) తదుపరి పోస్టింగ్ కోసం రెవెన్యూ విభాగంలో రిపోర్ట్ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

# మహిళ మెడలో గొలుసు చోరీ ఘటన

- ధైర్యంగా అడ్డుకున్న ఆటో డ్రైవర్
- ఆటో డ్రైవర్‌ను అభినందించి సన్మానించిన సిపి

**హైదరాబాద్, మే 5:**

ఓ సామాన్య ఆటో డ్రైవర్ అసామాన్య ధైర్య సాహసాలు ప్రదర్శించాడు. మహిళ మెడలో గొలుసు లాక్కుని పారిపోతున్న రౌడీ షీటర్‌ను తన ఆటో సాయంతో అడ్డుకున్నాడు. కర్రతో దాడి చేస్తున్నా బెదరకుండా అతడిని పట్టుకున్నాడు. రౌడీ షీటర్ అరెస్ట్ అవ్వడానికి ఎంతో కృషి చేశాడు. ఆటో డ్రైవర్ ధైర్యసాహసాలకు సరైన గుర్తింపు దక్కింది. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ఆటో డ్రైవర్ను సన్మానించారు. ఆ పూర్తి వివరాల్లోకి వెళితే.. మార్చి 4వ తేదీ తెల్లవారుజామున బేగం బజార్ జీన్సీ చౌరాహా ప్రాంతంలో మంజు ఓమ్లతా తన కోడలితో కలిసి మార్నింగ్ వాక్‌కు వెళ్లారు. హిందీ మర్వాడీ విద్యాలయ స్కూల్ వద్ద ఊహించని పరిణామం చోటుచేసుకుంది. డబీర్‌పురకు చెందిన రౌడీ షీటర్ మహ్మద్ సోహేల్ ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లేందుకు ప్రయత్నించాడు. ఆ క్రమంలో అతడి స్కూటీ అదుపుతప్పి కిందపడిపోయింది. బాధితురాలు గట్టిగా కేకలు వేసింది. అదే సమయంలో అటుగా వెళ్తున్న ఆటో డ్రైవర్ మహమ్మద్ జాహెర్ సైడ్ వ్యూ మిర్రర్ ద్వారా ఆ దృశ్యాన్ని చూశాడు. వెంటనే ఆటోను రివర్స్ చేశాడు. రౌడీ షీటర్ స్కూటీని పైకి లేపి అక్కడినుంచి తప్పించుకునే ప్రయత్నం చేశాడు. జాహెర్ ఆటోతో స్కూటీని ఢీకొట్టాడు. దీంతో మహ్మద్ సోహేల్ కిందపడిపోయాడు. జాహెర్ వెంటనే కిందకు దిగి సోహేల్‌ను పట్టుకున్నాడు. తర్వాత అటు వైపు వెళుతున్న వారు కూడా జాహెర్‌కు సాయం చేశారు. రౌడీ షీటర్‌ను పోలీసులకు పట్టించారు. అనంతరం జాహెర్ అక్కడినుంచి వెళ్లిపోయాడు. ఈ సంఘటనకు సంబంధించిన దృశ్యాలు అక్కడి సీసీటీవీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. ఎలాంటి ప్రతిఫలం ఆలోచించకుండా.. తన ప్రాణాలకు తెగించి రౌడీ షీటర్‌ను పోలీసులకు పట్టించిన జాహెర్‌ను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ మంగళవారం బంజారాహిల్స్, టీజీఐసీసీసీలోని తన ఛాంబర్‌లో ప్రత్యేకంగా సన్మానించారు. ప్రశంసా పత్రంతో పాటు నగదు పురస్కారాన్ని అందజేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో గోల్కొండ జోన్ డీసీపీ జీ చంద్ర మోహన్, గోషామహల్ ఎస్‌హెచ్ఓ శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# 9 రాష్ట్రాల్లో ఆపరేషన్ ఆక్టోపస్

**హైదరాబాద్, మే 5 :**

హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ఆపరేషన్ ఆక్టోపస్ 2.0తో పేరుతో భారీ ఎత్తున దాడులు నిర్వహించారు. తొమ్మిది రాష్ట్రాల్లో ఈ ఆపరేషన్లు నిర్వహించి.. 56 మంది నిందితులను అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో బ్యాంక్ సిబ్బందితోపాటు పట్టుబడ్డ నిందితులకు 101 కేసులతో సంబంధం ఉన్నట్లు పోలీసులు నిర్ధారించారు. అలాగే అరెస్ట్ అయిన వారిలో 32 మంది బ్యాంక్ మేనేజర్లు, కేవైసీ అప్రూవర్లు, రిలేషన్‌షిప్ మేనేజర్లతోపాటు ఫీల్డ్ ఆఫీసర్లు ఉన్నారు. అదే విధంగా 15 మంది అకౌంట్ హోల్డర్లతో పాటు, 9 మంది అకౌంట్ ఆపరేటర్లను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. వీరందరికీ 101 కేసులతో సంబంధం ఉందని పోలీసులు గుర్తించారు. ఈ నేపథ్యంలో బాధితులకు రూ. 69.99 లక్షలు రీఫండ్ చేశారు. ఈ 101 కేసుల్లో బాధితుల నుంచి రూ. 9.13 కోట్ల నగదును నిందితులు కొట్టేసినట్లు పోలీసులు గుర్తించారు. ఇక అరెస్టయిన వారిలో 17 మంది ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్‌కు సంబంధించిన వారని పోలీసులు వివరించారు. ట్రేడింగ్ ఫ్రాడ్‌లో 30 మంది, డిజిటల్ అరెస్ట్ కేసులో ఒకరిని అరెస్ట్ చేసినట్లు చెప్పారు.

# బెంగాల్‌లో ఎంఐఎంకు భారీ షాక్..

- పోటీ చేసిన 12 స్థానాల్లోనూ డిపాజిట్లు గల్లంతు

**కొల్కతా, మే 5:**

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎంఐఎం పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని ఈ పార్టీ పోటీ చేసిన 12 స్థానాల్లోనూ అభ్యర్థుల డిపాజిట్లు కోల్పోయింది.
బీహార్ తరహాలో ముస్లిం ఓట్లను చీల్చే లక్ష్యంతో అమ్ జనతా ఉన్నాయున్ పార్టీ నేత హుమయూన్ కబీర్‌తో పొత్తు పెట్టుకున్న ఎంఐఎం వ్యూహం బెంగాల్‌లో ఏమాత్రం ఫలించలేదు. ఆశించిన మద్దతు లభించకపోవడంతో పార్టీ తీవ్రంగా నిరాశ చెందింది.
ఇదిలా ఉండగా, హుమయూన్ కబీర్‌కు సంబంధించిన స్టింగ్ ఆపరేషన్ ఈ ఎన్నికల్లో కీలకంగా మారింది. బీజేపీకి లాభం చేకూర్చేందుకు ఓట్ల చీలిక చేస్తున్నామని ఆయన వ్యాఖ్యానించడం మైనారిటీ ఓటర్లలో తీవ్ర వ్యతిరేకతను రేకెత్తించింది. ఈ వివాదం తర్వాత ఎంఐఎం ఆ పార్టీతో దూరమయ్యే ప్రయత్నం చేసినప్పటికీ, అది ప్రయోజనం ఇవ్వలేదు. ఈ పరిణామాలతో ఎంఐఎంను ఓటర్లు పూర్తిగా తిరస్కరించినట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. బెంగాల్ రాజకీయాల్లో తన స్థానం ఏర్పరుచుకోవాలన్న ఎంఐఎం ఆశలు ఈ ఫలితాలతో అడియాశలయ్యాయి.

# ప్రాణహిత చేవెళ్లకు జాతీయ హోదా కల్పించాలి

- పోలవరంకు జాతీయ హోదా ఇచ్చి, తెలంగాణను విస్మరిస్తే ఎలా
- ఒక్క ప్రాజెక్టుకు కూడా జాతీయ హోదా ఇవ్వక పోవడం వివక్షే
- ధాన్యాన్ని కేంద్రం తీసుకోకుండా కొర్రీలు పెట్టడం సరికాదు
- నిధుల విడుదలలో జాప్యం చేయడం రైతుల్ని మోసం చేయడమే
- పంట వ్యర్థాలను కాల్చకుండా బయో గ్యాస్ ప్లాంట్‌లకు సరఫరా
- ప్రధాని మోడీకి భట్టి విక్రమార్క విజ్ఞప్తి

**రాజన్నసిరిసిల్ల, మే 5:**

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెలంగాణ పర్యటనను పురస్కరించుకుని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో డిజైన్ చేసిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును తక్షణమే జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు. సిరిసిల్లా జిల్లా గంభీరావుపేట గ్రామాంలోని పంతులుగారి తోటలో బయోస్ట్రాటమ్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటేడ్ ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్ నిర్మాణానికి మంగళవారం డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వర్ రావు, పొన్నం ప్రభాకర్ లతో కలిసి భూమి పూజ చేశారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం తెలంగాణలోని ఒక ప్రధాన సాగునీటి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పిస్తామని నాటి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాల్సిన బాధ్యత ప్రస్తుత ప్రభుత్వంపై ఉందని ఆయన గుర్తు చేశారు. 2014లో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తించినప్పటికీ, తెలంగాణలో ఏ ఒక్క ప్రాజెక్టుకు కూడా ఆ హోదా కల్పించకపోవడం తెలంగాణ రాష్ట్రం పట్ల చూపుతున్న వివక్షతకు నిదర్శనమన్నారు. తెలంగాణలో రైతులు పండించే ప్రతి పంటను కేంద్రం నిర్ణయించిన కనీస మద్దతు ధర ప్రకారమే రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అయితే, రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన ధాన్యాన్ని కేంద్రం తీసుకోకుండా కొర్రీలు పెట్టడం, నిధుల విడుదలలో జాప్యం చేయడం రైతుల్ని మోసం చేయడమేనని ఆయన విమర్శించారు. కేవలం కొన్ని పంటలకే మద్దతు ధర ప్రకటించి మిగిలిన వాటి విషయంలో కేంద్రం తప్పించుకునే ప్రయత్నం చేయవద్దని, రాష్ట్రం సేకరించిన ప్రతి గింజను కేంద్రమే సేకరించి సకాలంలో నిధులు విడుదల చేయాలని కోరారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాలు రైతు సంక్షేమం కోసం బహుళార్థక సాధక ప్రాజెక్టులను నిర్మించి, వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి రైతులకు అనేక రకాల ప్రోత్సహకాలు అందించి రైతులకు అండగా నిలబడిందన్నారు. వ్యవసాయ రంగంలో సరికొత్త విప్లవానికి నాంది పలుకుతూ వరి గడ్డిని ముడిసరుకుగా ఉపయోగించి బయో గ్యాస్ ఉత్పత్తి చేసే బృహత్తర ఆలోచనను కాంగ్రెస్ ప్రభుత్వం కార్యరూపంలోకి తెస్తోందన్నారు. సాధారణంగా పంట కోతల అనంతరం రైతులు పొలాల్లోనే గడ్డిని కాల్చివేయడం వల్ల వాతావరణం కలుషితమై ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ పడిపోతున్న తరుణంలో, ప్రభుత్వం ఈ వినూత్న కార్యక్రమాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. దీనివల్ల పర్యావరణానికి రక్షణ కలగడమే కాకుండా, రైతులకు వ్యర్థాల ద్వారా అదనపు ఆదాయం లభించే అవకాశం ఉందని వివరించారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా క్లీన్ ఎనర్జీ, గ్రీన్ ఎనర్జీపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్న నేపథ్యంలో, అభివృద్ధి చెందిన దేశాల బాటలో మన రైతాంగం కూడా అడుగులు వేయాలని ప్రభుత్వం ఆకాంక్షిస్తోందన్నారు. సమాజానికి ఆహారాన్ని అందించే రైతు, ఆరోగ్యకరమైన గాలిని కూడా అందించాలనే ఉద్దేశంతో పంట వ్యర్థాలను కాల్చకుండా బయో గ్యాస్ ఎ□`లాంట్‌లకు సరఫరా చేయాలని కోరారు. మరోవైపు, వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చేందుకు పంట మార్పిడి విధానాన్ని రైతులు పాటించాలని కోరారు. కేవలం వరి మీదనే ఆధారపడకుండా ఉద్యానవన పంటలు, చిరుధాన్యాలు, ఆయిల్ పామ్ వంటి లాభదాయకమైన పంటల వైపు రైతులు దృష్టి సారించినప్పుడే ఆర్థిక స్థితిగతులు మెరుగుపడతాయని తెలిపారు. వీటి సాగు వల్ల రైతులకు ఆదాయం పెరగడమే కాకుండా సమాజానికి పోషక విలువలతో కూడిన ఆహారం అందించిన వారవుతారని చెప్పారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం, పండించిన ప్రతి గింజకూ కనీస మద్దతు ధర కల్పించేందుకు కృతనిశ్చయంతో ఉందని. మద్దతు ధర ప్రకటించడమే కాకుండా, క్షేత్రస్థాయిలో కొనుగోలు పక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన వ్యవస్థను ఏర్పుట చేసిందన్నారు. పాత పద్ధతులకు స్వస్తి పలికి, ఆధునిక సాగు పద్ధతులను అవలంబించడం ద్వారానే వ్యవసాయం పండుగలా మారుతుందని, ఈ మార్పులో రైతులందరూ భాగస్వాములు కావాలని కోరారు.

# కరీంనగర్ బంగారం షాపు చోరీ

- ధర్మపురి లాడ్జిలో దొంగల బస
- సీసీ టీవీ ఫుటేజ్ ఆధారంగా దొంగలను గుర్తించే పని

**కరీంనగర్, మే 5:**

కరీంనగర్‌లోని బంగారం షాపు చోరీ కేసులో దర్యాప్తును పోలీసులు వేగవంతం చేశారు. జగిత్యాల జిల్లా ధర్మపురిలోని ఒక లాడ్జిలో దుండగుల ముఠా బస చేసినట్లు గుర్తించారు. గోదావరి తీరం పక్కనే ఉన్న □ఫైవేట్ లాడ్జిలో వారు రెండు రోజులు ఉన్నట్లు పోలీసులు కనుగొన్నారు. మే 3వ తేదీ ఉదయం లాడ్జిని ఖాళీ చేసిన ఈ ముఠా.. బైక్‌లపై మట్టి రోడ్డు ద్వారా కరీంనగర్ చేరుకున్నట్లు పోలీసులు గుర్తించారు. ధర్మపురి నుంచి బయలుదేరిన ఈ ముఠా.. ధర్మారం, పెగడపల్లి, రామడుగు మండలాల వి□దుగా కరీంనగర్‌కు చేరుకుందని సీసీ కెమెరాల ద్వారా పోలీసులు నిర్ధారించుకున్నారు. ఈ సందర్భంగా ధర్మపురిలో వీరు బస చేసిన లాడ్జిని పోలీసులు తనిఖీ చేశారు. అలాగే సీసీ టీవీ ఫుటేజ్‌ను పోలీసులు జల్లెడ పడుతున్నారు. అదే సమయంలో వారి ఫోన్ కాల్‌స్‌ను సైతం పోలీసులు పరిశీలిస్తున్నారు. పక్కాగా రెక్కీ చేసిన తర్వాతే కరీంనగర్‌లోని పీఎంజే దుకాణంలో చోరీ చేసి.. సిబ్బందిపై కాల్పులు జరిపినట్లు పోలీసులు ఒక నిర్ధారణకు వచ్చారు.



సంపాదకీయం

# ప్రజల ఆకాంక్షలను బీజేపీ గౌరవించాలి!

దేశంలో అత్యధిక రాష్ట్రాలు ఇప్పుడు బీజేపీ ఖాతాలో పడ్డాయి. మోడీ నామజపంతో పొంగిపోకుండా ప్రజలకు మార్పును చూపాలి. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేకానేక సమస్యలకు పరిష్కారం దక్కాలి. విద్య,వైద్యం,ఉపాధి రంగాలకు పెద్దపీట వేయాలి. బీజేపీ రావడం వల్లనే ఈ సమస్యలు పరిష్కారం అయ్యాయని ప్రజలు చర్చించాలి. అప్పుడే మార్పు సాధ్యం అవుతుంది. ఇకపోతే మిగతా రాష్ట్రాల్లో ఎలా ఉన్నా..బెంగాల్లో సరిహద్దులకు కంచె వేస్తామన్న బీజేపీ హామీ నెరవేర్చాలి. ఇందుకు తక్షణం నడుం బిగించాలి. అలాగే చొరబాటుదారులను గుర్తించి నిర్దాక్షిణ్యంగా ఏరి పారేయాలి. ఎందుకంటే చొరబాటుదారులు స్థానిక ప్రజలను మించి, పెత్తనం సాగిస్తున్నారు. ఊరూరా జల్లెడ పట్టి వారిని గుర్తించాలి. రోహింగ్యాల విషయంలో ఎలాంటి క్షమాగుణం అవసరం లేదు. భారతదేశం ధర్మసత్రం కాదన్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా వెంటనే ఇందుకు కార్యాచరణ సిద్దం చేయాలి. బెంగాల్‌తో పాటు అసోం, ఈశాన్య రాష్ట్రాలను జల్లెడపడితే తప్ప స్థానికంగా గొడవులు సద్దుమణగవు. ఒక్కొక్కరిని గుర్తించి, వారి ఆధార్, రేషన్ కార్డులు, డ్రైవింగ్ లైసెన్సులు వంటివన్నీ లాగేసుకుని సరిహద్దు దాటించాలి. అలాగే సరిహద్దు కంచెపైనా నిర్ణయం తీసుకోవాలి. ఇవే సమస్యలపై బీజేపీ పోరాడింది కనుక ప్రభుత్వం ఏర్పాటు కాగానే ప్రథమ కర్తవ్యం ఇదే కావాలి. యావద్భారతంలో ఆసక్తి రేకెత్తించిన ఐదు అసెంబ్లీల ఎన్నికల ఫలితాలను విశ్లేషిస్తే ప్రజలు మార్పును కోరుకున్నారు. బెంగాల్లో మమతా బెనర్జీ 15 ఏళ్ల రాక్షస పాలనను ప్రజలు తమ ఓటుహక్కుతో తిరస్కరించారు. ఇకపోతే తమిళనాటు విజయ్ గెలవడం ఓ సంచలనమే. ఆయన హామీలు గుప్పించారు. తెలుగు రాష్ట్రాల్లో లాగా బంగారం, మహిళలకు నెలనెలా పెన్షన్ లాంటి చెల్లింపులు తదితర హామీలు గుప్పించారు. ద్రవిడ పార్టీల ఆధిక్యాన్ని సవాలు చేస్తూ.. తమిళనాట సినీ హీరో విజయ్ అరంగేట్రంలోనే అదరగొట్టడంలో హామీల బుట్ట కూడా ఉంది. సినీ ఛరిష్మాకు తోడు, హామీలు కూడా కలసి వచ్చాయి. కనుక గత పాలకుల వైఫల్యాలను ముందు పెట్టుకుని విజయ్ నడుచుకుంటేనే నిలదొక్కు కోగలరు. కేరళలో యూడీఎఫ్ మళ్లీ పీఠమెక్కడంతో.. కామ్రేడ్లకు ఇక దేశంలో ఎక్కడా స్థానం లేకుండా పోయింది. మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు బెంగాల్, త్రిపుర, కేరళలో అవకాశాలు లేనట్లుగానే భావించారు. ఇది వారి స్వయంకృతమనే చెప్పలి. నేలవిడిచి సాము చేయడం కమ్యూనిస్టులకు అలవాటు. కేరళలో కూడా అదే జరిగింది. పదేళ్ల పినరయ్ విజయన్ అధికారంలో కేరళలో గణనీయమైన మార్పులు గోచరించ లేదు. అస్సాంలో కమలం ముచ్చటగా మూడోసారి జయభేరి మోగించారు. పుదుచ్చేరిలో మళ్లీ సామాన్యుడికే పీఠం దక్కింది. అస్సాం, పుదుచ్చేరి తప్పిస్తే... అంతటా ఓటర్లు మార్పునే కోరుకున్నారు.భారత ప్రజాస్వామ్యంపై నమ్మకం కల్పించిన రోజిది. మన రాజ్యాంగం, రాజ్యాంగ సంస్థలు విజయం సాధించాయి. అని ప్రధాని మోడీ ప్రకటించుకున్నారు. ఒక్కో రాష్ట్రం బీజేపీ ఖాతాలో పడుతున్న వేళ ప్రజలకు మేలైన పాలన దిశగా బీజేపీ కృషి చేయాలి. లేకుంటే ఈ ఆనందం ఆవిరి కావడానికి కూడా సమయం పట్టదు. గంగోత్రి నుంచి గంగాసాగర్ వరకు కమలం వికసించిందన్న ప్రధాని మోదీ, ప్రజల ఆకాంక్షలను కూడా పట్టించుకోవాలి. దేశంలో అనేకానేక సమస్యలు ఉన్నాయి. వాటిపై కమలనాథులు దృష్టి సారించాలి. ఇద్దరు ముఖ్యమంత్రులు స్టాలిన్, మమతా బెనర్జీ తాము పోటీ చేసిన స్థానాల్లో ఘోర పరాజయం పాలయ్యారు. ఆయా రాష్ట్రాల్లో పలువురు మంత్రులు మట్టికరిచారు. భవానీపుర్‌లో పోటీ చేసిన ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తన ప్రత్యర్థి, ప్రతిపక్ష భాజపా నేత సువేందు అధికారి చేతిలో ఘోర పరాజయం పాలయ్యారు. ఆమెతోపాటు దాదాపు 20 మంది మంత్రులు ఓడిపోయారు. సువేందు అధికారి రెండు చోట్లా విజయం సాధించారు. ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న సమయంలో మమతా బెనర్జీ తీవ్ర అసహనానికి గురయ్యారు. చివరి వరకూ వేచి ఉండాలని, విజయం తమదేనని మధ్యాహ్నం సమయంలో వీడియో సందేశంలో పేర్కొన్నారు. ఎన్నికల సంఘం, భాజపాపై తీవ్ర విమర్శలు చేశారు. అయితే సాయంత్రానికి తృణవ-ూల్ పరాజయం పరిపూర్ణమైంది. రాజకీయాల్లో కక్షలు కార్పణ్యాలు తగవు. ప్రజలను ప్రజలుగా చూడలేని వారు అధికారానికి అనర్హులు. బెంగాల్లో ప్రజలకు గత పదిహేనేళ్లుగా స్వేచ్ఛ లేకుండా పోయింది. బెంగాల్ విజయంతో భాజపా స్వతంత్రంగా పాలించే రాష్ట్రాల సంఖ్య 15కు చేరనున్నాయి. అదనంగా బిహార్‌లో జేడీయూ, ఆంధ్రప్రదేశ్‌లో తెదేపా, నాగాలాండ్‌లో నాగా పీపుల్స్ ఫ్రంట్, మేఘాలయ లో నేషనల్ పీపుల్స్ పార్టీ తదితరాలతో కలిపి భాజపా అధికారంలో ఉన్న రాష్ట్రాల సంఖ్య 21కి చేరుతోంది. దాదాపు 75శాతం రాష్ట్రాలు బీజేపీ గుప్పిట ఉన్నట్లే. కనుక పాలనలో మార్పు కనిపించాలి. ప్రజలకు బీజేపీ పట్ల అనురాగం పెరగాలి. ఇజెపికి ఓటేసినందుకు ప్రజలు ఆనందపడాలి. అందుకు అనుగుణంగా పాలనా పరమైన మార్పులు రావాలి. రాజకీయ పందురాలకు, ఉచిత పథకాలకు దూరంగా ఉండాలి. పన్నుల రూపంలో వచ్చే డబ్బులను అభివృద్ధికే వినియోగించాలి. అప్పుడే బీజేపీని మరోమారు ప్రజలు నమ్ముతారు. అందుకు కఠినమైన నిర్ణయాలకు కూడా వెనకాడరాదు.

# నేను ఓడిపోలేదు.. రాజీనామా చేయను

- బెంగాల్లో బీజేపీ కుట్రలతో గెలిచింది..
- తొత్తుగా మారిన ఎన్నికల సంఘం
- ప్రధాన విలన్ ఎన్నికల కమిషనర్
- మమతా బెనర్జీ వ్యాఖ్యలు

కోల్‌కతా, మే 5: పశ్చిమబెంగాల్ ఎన్నికల్లో బీజేపీ కుట్రలతోనే గెలిచిందని టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ అన్నారు. బీజేపీకి ఈసీ ఏజెంట్‌గా మారిందని ఆక్షేపణ తెలిపారు. ఈ ఎన్నికలో ప్రధాన విలన్ ఎన్నికల సంఘమేనని విమర్శలు గుప్పించారు. 100పైగా సీట్లు లూటీ చేశారని, తాను ఎన్నికల్లో ఓడిపోలేదని చెప్పారు. అందువల్ల తాను రాజీనామా చేసే ప్రసక్తి కూడా లేదన్నారు. లోక్‌భవన్‌కు వెళ్లనని, రాజీనామా చేయమని తనను ఎవరూ ఒత్తిడి చేయలేరని స్పష్టం చేశారు. పశ్చిమబెంగాల్ ఎన్నికల ఫలితాల అనంతరం తొలిసారి మీడియా సమావేశంలో మంగళవారం మమతాబెనర్జీ మాట్లాడుతూ.. ఈసీ, బీజేపీపై ఘాటు విమర్శలు చేశారు. బీజేపీ కనుసన్నల్లో ఈసీ పనిచేసిందన్నారు. అమిత్‌షా, ప్రధాని మోడీ కలసి కుట్రలు చేశారని మండిపట్టారు. 'ఈ ఎన్నికల్లో విలన్‌గా ప్రధాన ఎన్నికల కమిషనర్ వ్యవహరించారు. బెంగాల్‌లో ఈవీఎంలను లూటీ చేశారు' అని మమత ఆరోపించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు పోలింగ్ ముగిసిన తర్వాత కూడా 80 నుంచి 90 శాతం కంటే ఎక్కువ బ్యాటరీని కలిగి ఉండటం ఏమిటని ప్రశ్నించారు. పోలింగ్‌కు రెండ్రోజుల ముందే అధికారులు తమ పార్టీపై దాడులు, కార్యకర్తల అరెస్టులు చేశారని అన్నారు. భవనీపూర్‌లో ఉద్దేశపూర్వకంగానే ఒక ప్లాన్ ప్రకారం తనను ఓడించారని, ఎన్నికల కమిషన్‌ను దుర్వినియోగపరిచి బీజేపీ విజయం సాధించిందని, తన జీవితంలో ఎప్పుడూ ఇలాంటి ఎన్నికలు చూడలేదని అన్నారు. కౌంటింగ్ సెంటర్లలో టీఎంసీ కార్యకర్తలను కొట్టారని, తనను 'సీఆర్‌పీఎఫ్ గూండాలు' పొత్తికడుపులో తన్ని కౌంటింగ్ సెంటర్ నుంచి గెంటేశారని తీవ్రారోపణలు చేశారు. ఎస్ఐఆర్ నుంచి 90 లక్షల ఓట్లను తొలగించారనీ, కోర్టుకు వెళ్లడంతో 32 లక్షల ఓట్లు చేర్చారని, టీఎంసీని ఓడించేందుకు అన్నిరకాలుగా ఎత్తుగడలు పన్ని 100 సీట్ల వరకూ బీజేపీ లూటీ చేసిందని విమర్శించారు. ఈ మొత్తం ఉదంతంలో 'ఇండి' కూటమి తన వైపే ఉందని తెలిపారు. ఎన్నికల ఫలితాల అనంతరం సోనియాగాంధీ, రాహుల్ గాంధీ తనతో మాట్లాడారని, అఖిలేష్ యాదవ్, తేజస్వి యాదవ్, హేమంత్ సోరెన్ తదితరులు ఫోను చేసి సపోర్ట్‌గా నిలిచారని చెప్పారు. 'ఇండి' కూటమిలోనే తాను కొనసాగుతానని కూడా స్పష్టం చేశారు.





# బెంగాల్, అసోంలో ఓట్ చోరీ

జనాదేశాన్ను చోరీచేసిన బీజేపీ

మరోమారు రాహుల్ విమర్శలు

**న్యూఢిల్లీ, మే5:** బెంగాల్, అసోంలో ఓటు చోరీ జరగిందని విపక్షనేత రాహుల్ మరోమారు ఆరోపించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు దేశ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) ఓటమి చెందడంతో కొందరు కాంగ్రెస్ నేతలు సంబరాలు చేసుకోవడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బెంగాల్, అస్సాం రాష్ట్రాల్లో జనాదేశాన్ని బీజేపీ చోరీచేసిందని ఆరోపించారు. ఇది కేవలం ఓ పార్టీ ఓటమి కాదని, దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను కూనీ చేసే ప్రమాదకర పరిణామం అని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. సంకుచిత రాజకీయ ప్రయోజనా లను పక్కనపెట్టి.. దేశ ప్రజాస్వామ్య పరిరక్షణపై అన్ని పార్టీలు దృష్టి సారించాలని ఈ సందర్భంగా రాహుల్ పిలుపునిచ్చారు. 'ఇది ఒక పార్టీకి సంబంధించిన విషయం కాదు. దేశ అస్తిత్వానికి సంబంధించిన సమస్య' అని ఆయన పేర్కొన్నారు. విపక్ష పార్టీల మధ్య అనైక్యత పెరుగుతున్న నేపథ్యంలో.. అది బీజేపీకి వరంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. బెంగాల్, అస్సాం రాష్ట్రాల్లో చోటుచేసుకున్న పరిణామాలు దేశ ప్రజాస్వామ్య వినాశనానికి సంకేతాలుగా పరిగణించాల్సిన అవసరం ఉందని రాహుల్ హెచ్చరించారు. విపక్షాలు పరస్పర విభేదాలను తగ్గించి, ప్రజాస్వామ్య రక్షణ కోసం ఒకే వేదికపైకి రావాలని సూచించారు. దేశ భవిష్యత్తు దృష్ట్యా రాజకీయ పార్టీలన్నీ బాధ్యతతో వ్యవహరించాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన అభిప్రాయపడ్డారు.

# బెంగాల్, అసోంకు బీజేపీ పరిశీలకుల నియామకం

అమిత్ షా, జేపీ నడ్డాలకు పార్టీ బాధ్యతలు

న్యూఢిల్లీ, మే 5: పశ్చిమ బెంగాల్, అసోంలలో బీజేపీ ఘన విజయం సాధించిన నేపథ్యంలో అక్కడ ప్రభుత్వాల ఏర్పాటుకు బిజెపి రంగం సిద్దం చేసింది. ఈ రెండు రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేయబోతుంది. బెంగాల్ సీఎం ఎవరూ అనేదానిపై ఉత్కంఠ నెలకొంది. ఈ నేపథ్యంలో పశ్చిమ బెంగాల్‌లో ప్రభుత్వ ఏర్పాటుకు సంబంధించి కేంద్ర పరిశీలకుడిగా కేంద్ర హోంమంత్రి అమిత్ షాను బీజేపీ అధిష్టానం నియమించింది. అలాగే, ఒడిశా సీఎం మోహన్ చరణ్ మాఝీని సహ పరిశీలకుడిగా నియమించింది. అమిత్ షా, మోహన్ చరణ్ ఆధ్వర్యంలో బెంగాల్‌లో బీజేపీ ఎమ్మెల్యేలు, అగ్రనేతలు సమావేశమవుతారు. బెంగాల్ బీజేపీ లెజిస్లేటివ్ నేతను ఎన్నుకుంటారు. ముఖ్యమంత్రి అభ్యర్థిని ఎన్నుకోవడం, కొత్త ప్రభుత్వ ఏర్పాటును షా, మోహన్ పర్యవేక్షిస్తారు. బెంగాల్‌లో ఈ నెల 9న కొత్త ప్రభుత్వం ఏర్పాటు కానుంది. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ 207 సీట్లు గెలుచుకుంది. మరోవైపు అసోంకు సంబంధించి ప్రభుత్వ ఏర్పాటుకోసం కేంద్ర పరిశీలకుడిగా కేంద్ర మంత్రి, బీజేపీ మాజీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డాను బీజేపీ నియమించింది. నడ్డాతోపాటు సహపరిశీలకుడిగా హరియాణా సీఎం నయాబ్ సింగ్ సైని వ్యవహరిస్తారు. వీరు ఇద్దరూ అసోంలో బీజేపీ కూటమి ప్రభుత్వ ఏర్పాటు, లెజిస్లేటివ్ పార్టీ లీడర్ ఎన్నికను పర్యవేక్షిస్తారు. అసోంలో బీజేపీ కూటమి 82 సీట్లు గెలుచుకుంది. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ తొలిసారి అధికారం చేపట్టబోతుంది. దీంతో ముఖ్యమంత్రి అభ్యర్థి విషయంలో ఆసక్తి నెలకొంది. బీజేపీ అధిష్టానం ఎవరిని నియమిస్తుందో చూడాలి. ప్రస్తుతానికి సువేందు అధికారి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. అసోంలో ఇప్పటికే బీజేపీ నుంచి సీఎంగా ఉన్న హిమంత బిశ్వ శర్మ అదే పదవిలో కొనసాగుతారు.



# 1.52 లక్షల కోట్లతో అభివృద్ధి పథకాలకు గ్రీన్ సిగ్నల్

లక్ష్యం 'వికసిత భారత్'..

మార్గం మౌలిక సదుపాయాల కల్పన

కేంద్ర క్యాబినెట్ భారీ నిర్ణయాలు

**న్యూఢిల్లీ, మే 5:** దేశాభివృద్ధిని పరుగులు పెట్టించే దిశగా కేంద్ర క్యాబినెట్ ఇవాళ సంచలన నిర్ణయాలు తీసుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో పలు కీలక ప్రాజెక్టులు, సంక్షేమ పథకాలకు ఆమోదం తెలుపుతూ దాదాపు రూ. 1,52,702 కోట్ల నిధులను మంజూరు చేసింది. మౌలిక సదుపాయాలు, వ్యవసాయం, సెమీకండక్టర్ రంగాలకు ఈ నిధులను కేటాయించారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా కేంద్రం భారీ కేటాయింపులు చేసింది. చెరుకు రైతులకు తీపి కబురు అందించింది. 2026-27 సంవత్సరానికి గాను చెరుకు 'ఫెయిర్ అండ్ రెమ్యునరేటివ్ ప్రైస్' కోసం ఏకంగా రూ.లక్ష కోట్లను కేటాయించింది. కాటన్ మిషన్.. పత్తి ఉత్పాదకతను పెంచేందుకు 'మిషన్ ఫర్ కాటన్ ప్రొడక్టివిటీ' కింద రూ. 5,659 కోట్లు మంజూరు చేసింది. టెక్నాలజీ రంగంలో స్వయం సమృద్ధి సాధించేందుకు సెమీకండక్టర్ యూనిట్ల ఏర్పాటుకు ప్రోత్సాహకాలు ప్రకటించింది. క్రిస్టల్ మ్యాట్రిక్స్ లిమిటెడ్.. సెమీకండక్టర్ యూనిట్ ఏర్పాటు కోసం ఈ సంస్థకు రూ. 3,068 కోట్లు కేటాయించారు. సుచి సెమికాన్ ప్రైవేట్ లిమిటెడ్.. మరో యూనిట్ కోసం రూ.868 కోట్లు మంజూరు చేశారు. రైల్వే నెట్‌వర్క్‌ను బలోపేతం చేసేందుకు మూడు కీలక మార్గాల్లో 3వ, 4వ లైన్ల నిర్మాణానికి ఆమోదం తెలిపారు. నగద - మథుర రైల్వే లైన్ నిర్మాణానికి రూ.16,403 కోట్లు, గుంతకల్ - వాడిలైన్ నిర్మాణానికి రూ.4,758 కోట్లు కేటాయించారు. ఇది తెలుగు రాష్ట్రాల ప్రయాణికులకు ఎంతో మేలు చేకూరుస్తుంది. బుర్హ్వాల్ - సీతాపూర్ రైల్వే లైన్‌కు రూ.2,276 కోట్లు కేటాయించారు. వీటితోపాటు మరికొన్ని ఇతర కీలక నిర్ణయాలను కేంద్ర క్యాబినెట్ తీసుకుంది. ఎంఎస్ఎంఈలకు మద్దతునిచ్చేలా ఎమర్జెన్సీ క్రెడిట్ లైన్ గ్యారంటీ స్కీమ్ కోసం రూ. 18,100 కోట్లు కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు. షిప్పింగ్ రంగం.. వడినర్‌లో ఓడల మరమ్మత్తుల సౌకర్యాల అభివృద్ధికి రూ. 1,570 కోట్లు కేటాయించారు. సుప్రీంకోర్టు బలోపేతం.. అత్యున్నత న్యాయస్థానం పనితీరును మరింత మెరుగుపరచడానికి, మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి ఒక కీలక విధాన నిర్ణయాన్ని క్యాబినెట్ ఆమోదించింది. ఈ భారీ కేటాయింపులు దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే కాకుండా, భారీగా ఉద్యోగ అవకాశాలను కల్పిస్తాయని కేంద్రం ఆశాభావం వ్యక్తం చేసింది.






# ఇద్దరు భారతీయ జర్నలిస్టులకు పులిట్జర్

**న్యూఢిల్లీ, మే 5:** భారతీయ ఇలుస్ట్రేటర్ ఆనంద్ ఆర్‌కే, జర్నలిస్టు సుపర్ణ శర్మ.. 2026 పులిట్జర్ అవార్డును గెలుచుకున్నారు. ఇలుస్ట్రేటెడ్ రిపోర్టింగ్ అండ్ కామెంటరీ విభాగంలో వాళ్లు ఈ అవార్డు చేజిక్కించుకున్నారు. ట్రాప్డ్ అనే కథనం కోసం ఆ ఇద్దరు జర్నలిస్టులతో కలిసి నాటాలీ ఒబికో పియర్సన్ కూడా పనిచేశారు. ఈ ముగ్గురూ అవార్డును షేర్ చేసుకున్నారు. డిజిటల్ అరెస్టుకు చెందిన కథనాన్ని చాలా సునిశితంగా ప్రజెంట్ చేశారు. చాలా బలమైన విజువల్స్‌తో ఆ కథనాన్ని ప్రసారం చేశారు. దక్షిణాసియాలో సైబర్ నేరగాళ్ల ముఠా ఎలా పనిచేస్తుందన్న కోణంలో ట్రాప్డ్ కథనంలో చూపించారు. న్యూయార్క్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో పులిట్జర్ ప్రైజ్ విజేతలను ప్రకటించారు. ఆరితేరిన సైబర్ నేరగాళ్లు ఎలా ఓ భారతీయ న్యూరాలజిస్టును బోల్తా కొట్టిస్తారో ట్రాప్డ్ స్టోరీలో ప్రజెంట్ చేశారు. ఇన్వెస్టిగేట్ జర్నలిజం విధానంలో ఈ కథనం సాగుతుంది. కథనంలో ఎడిటోరియల్ గాఢత ఎక్కువగా ఉన్నట్లు పులిట్జర్ బోర్డు ప్రశంసించింది. ట్రాప్డ్ ప్రాజెక్టు కోసం ముంబై ఆర్టిస్టు ఆనంద్ ఆర్కే బొమ్మలను గీశారు. గ్రాఫిక్ స్టోరీటెల్లింగ్‌లో అతను మాస్టర్. గతంలో ఆయన 2021లో ఈస్నర్ అవార్డు గెలుచుకున్నారు. బ్లూ ఇన్ గ్రీన్ అనే గ్రాఫిక్ నవలకు ఆ అవార్డు వచ్చింది. ఇక జర్నలిస్టు సుపర్ణ శర్మ ఈ కథనానికి రిపోర్టింగ్ చేశారు. బ్లూమ్‌బర్గ్‌కు చెందిన టోక్యో రిపోర్టర్ నటాలీ ఒబికో పియర్సన్ కూడా ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్ చేశారు. అంతర్జాతీయ రిపోర్టింగ్ కేటగిరీలో మరో భారతీయ జర్నలిస్టు అనిరుద్ధ్ ఘోసల్ పులిట్జర్ ప్రైజ్ గెలిచారు. అమెరికా బోర్డర్ పెట్రోలింగ్ పోలీసులకు చెందిన నిఘా వ్యవస్థల టెక్నాలజీ గురించి ఇన్వెస్టిగేట్ చేశారు.

# ఆధునికీకరణ దిశగా రైలుబండి పరుగులు

## భారత్‌లో ప్యాసింజర్ రైలు మొదలై 173 ఏళ్లు

- 1853లో బాంబే నుంచి థానే మధ్య తొలి రైలు
- దేశ అభివృద్ధి ముఖచిత్రాన్ని మార్చిన రైల్వే
- ప్రస్తుతం ప్రతిరోజు 25 వేల రైళ్ల రాకపోకలు
- 99.6 శాతం విద్యుదీకరణతో ఆధునిక హంగులు



**హైదరాబాద్, మే 05, రాజముద్ర న్యూస్:** భారత్‌లో తొలి ప్యాసింజర్ రైలు మొదలై 173 ఏళ్లు దాటింది. 1853 ఏప్రిల్ 16న బాంబే నుంచి థానే మధ్య మొదలైన రైలు ప్రయాణం దేశంలో రవాణా వ్యవస్థ ముఖచిత్రాన్నే మార్చేసింది. దేశాభివృద్ధి దిశగా కొత్త బాటలు వేసింది. సుమారు 400 మంది ప్రయాణికులతో మొదలైన భారతీయ రైలుబండి ఇప్పుడు కోట్లాదిమంది తమ గమ్యస్థానాలకు వేగంగా, సురక్షితంగా చేరుస్తోంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా రోజుకు 25 వేల రైళ్లు నడుస్తున్నాయి. 2025-26లో భారతీయ రైళ్లు ఏకంగా 741 కోట్ల మంది ప్రయాణికులకు సేవలందించింది. రైల్వేకు రూ.80 వేల కోట్ల రెవెన్యూ లభించింది. 1,670 మిలియన్ టన్నుల వస్తు రవాణా జరిగింది. భారతీయ రైల్వే విస్తృతికి ఈ లెక్కలు సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి.

**స్టీమ్ ఇంజిన్లు పోయి.. స్పీడ్ ఇంజిన్లు:** మొదట దేశవ్యాప్తంగా పొగలు చిమ్మే స్టీమ్ ఇంజిన్లతో కూడిన రైళ్లే నడిచేవి. 1980లలో స్టీమ్ ఇంజిన్ల స్థానంలో డిజిల్, ఎలక్ట్రిక్ లోకోమోటివ్‌లను ప్రవేశపెట్టడం మొదలైంది. ముఖ్యంగా గత దశాబ్దకాలంగా భారతీయ రైల్వే ఆధునికీకరణ బాట పట్టింది. 2014కు ముందు మొత్తం రైల్వే వ్యవస్థలో 20 శాతం మాత్రమే విద్యుదీకరణ జరిగింది. ఇప్పుడు 99.6 శాతం రైల్వే వ్యవస్థ విద్యుదీకరణ పూర్తయ్యింది. విద్యుదీకరణకు ఇచ్చిన ప్రాధాన్యత అనేక ప్రయోజనాలకు కారణమైంది. విద్యుదీకరణ వల్ల 2024-25లో 180 కోట్ల లీటర్ల డీజిల్ ఆదా కావడంతో ముడి చమురు దిగుమతులపై ఆధారపడటం తగ్గింది. ఎలక్ట్రిక్ లోకోమోటివ్‌లు పర్యావరణ అనుకూలమైనవి కావడంతో పాటు డీజిల్ వాటితో పోలిస్తే 70 శాతానికి పైగా తక్కువ ఖర్చుతో నడుస్తాయి.

**ఆధునిక రైళ్ల పరుగులు:** రైళ్ల వేగం పెంచడంపైనా గత దశబ్దకాలంగా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. 2014-26 మధ్యకాలంలో 54,600 కిలోమీటర్ల రైల్వే ట్రాక్‌ల ఆధునికీకరణ జరిగింది. గంటకు 110 కిలోమీటర్ల వేగంతో రైళ్లు వెళ్లేందుకు వీలైన ట్రాక్ 2014లో 31,445 కిలోమీటర్లు ఉండగా ఇప్పుడది 85,000 కిలోమీటర్లకు పెరిగింది. వేగంగా నడిచే వందే భారత్, వందే భారత్ స్లీపర్, అమృత్ భారత్ వంటి రైళ్లు అందుబాటులోకి వచ్చాయి. ఇవన్నీ ప్రయాణికులకు మరింత సౌకర్యాన్ని అందిస్తున్నాయి. మరోవైపు దేశంలో ఏడు హైస్పీడ్ రైలు కారిడార్ల ఏర్పాటు దిశగా కేంద్రం బడ్జెట్‌లో ప్రతిపాదించింది.

**ప్రయాణికుల భద్రతకు పెద్దపీట:** భారతీయ రైల్వేకు ఆధునికతను జోడిస్తూనే ప్రయాణికుల భద్రకు కేంద్రం ప్రాధాన్యత పెంచుతోంది. రైళ్లు ఢీకొనడాన్ని నివారించే కవచ్ వ్యవస్థను ఇప్పటికే 3,100 కిలోమీటర్ల మార్గంలో అందుబాటులోకి తేగా, మరో 24,400 కిలోమీటర్ల దారిలో పనులు కొనసాగుతున్నాయి. 1,872 రైల్వే స్టేషన్లలో ఏఐ ఆధారిత వీడియో సర్వైలెన్స్ వ్యవస్థతో నిఘా ఏర్పాటుచేసింది. 1,405 సమీకృత ప్యాసింజర్ ఇన్ఫర్మేషన్ వ్యవస్థను ఏర్పాటుచేసి ప్రయాణికులకు రైల్వే సమాచారాన్ని మరింత మెరుగ్గా చేరవేస్తోంది.

## సాదా బైనామా, భూభారతి పెండింగ్ అప్లికేషన్లపై ఆకస్మికంగా తనిఖీ



జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి

**మేడ్చల్ జిల్లా కలెక్టరేట్, రాజముద్ర న్యూస్:** సాదా బైనామా, భూ భారతి పెండింగ్ అప్లికేషన్లను పరిశీలించిన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి. మంగళవారం ఘట్‌కేసర్ మండల తహసీల్దార్ ఆఫీస్‌ను కీసర ఆర్డిఓ రాజేష్ కుమార్ తో కలిసి అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి. ఆకస్మికంగా తనిఖీ చేసినారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సాదా బైనామా, భూ భారతి పెండింగ్ అప్లికేషన్లను పరిశీలించి పెండెన్సి త్వరితగతిన పూర్తి చేయాలని తహసీల్దారును ఆదేశించారు. తెలంగాణ ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన భూమి రికార్డుల సమగ్ర పోర్టల్ భూభారతిలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి సూచనలు జారీ చేసారు. పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పెండెన్సికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. సాదా బైనామా, భూ భారతి రికార్డులను అదనపు కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఘట్కేసర్ తహసీల్దారు చంద్రశేఖర్, సీనియర్ అసిస్టెంట్ ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.




## ఘట్‌కేసర్‌లో జర్నలిస్టులకు గుర్తింపు కార్డుల పంపిణీ

**ఘట్కేసర్, రాజముద్ర న్యూస్:** అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని టీయూడబ్ల్యూజే మేడ్చల్ జిల్లా అధ్యక్షులు జి బాలరాజ్, ప్రధాన కార్యదర్శి డి వెంకట్రాంరెడ్డి తెలిపారు. ఘట్‌కేసర్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన టీయూడబ్ల్యూజే సమావేశంలో యూనియన్ గుర్తింపు కార్డులను జర్నలిస్టులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, వారి హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటం కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. ముఖ్యంగా అక్రిడిటేషన్ కార్డుల మంజూరులో పారదర్శకత ఉండేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులను సన్మానించారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు లింగాల భూపాల్, టియూడబ్ల్యూజే జిల్లా సంయుక్త కార్యదర్శి వి.గోవిందరాజ్, జర్నలిస్టులు ఎఫ్.రామకృష్ణ, కె.నర్సింహ్మ , కె.యాదగిరి, కె.శ్రీనివాసరెడ్డి, ఎస్.నర్సింగ్ రావు, ఎల్. రాజు, సిహెచ్.నిరంజన్, కె. రమేష్, ఎన్. శ్రీనివాస్, జి.సత్యనారాయణ ఎస్.సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో పాల్గొన్న పిఎసిఎస్ చైర్మన్ మల్లేపల్లి బుచ్చిరెడ్డి

- వెలిమెల రైతు వేదిక లో రైతు వారోత్సవాలు ప్రారంభం
- సహజ వ్యవసాయం నేల ఆరోగ్య పరిరక్షణ లో రైతులకు అవగాహన
- ఆధునిక పద్ధతులతో వ్యవసాయం చేయాలని రైతులకు అధికారుల సూచన





పి ఎ సి ఎస్ చైర్మన్ మల్లేపల్లి బుచ్చిరెడ్డి

**పఠాన్ చెరువు రాజముద్ర న్యూస్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 58వ రోజు రామచంద్రాపురం మండలం వెలిమల రైతు వేదికలో, తెల్లాపూర్ ప్యాక్స్ చైర్మన్ మల్లేపల్లి బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో రైతు వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా హాజరైన మండలంలోని రైతులకు నేల ఆరోగ్య పరిరక్షణ, సమతుల్య ఎరువులు వాడడం, సహజ వ్యవసాయం గురించి అధికారులు రైతులకు సూచనలు అందించారు. రైతులను ఉద్దేశించి ప్యాక్స్ చైర్మన్ మల్లేపల్లి బుచ్చిరెడ్డి మాట్లాడుతూ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం తెల్లాపూర్ ద్వారా ఇక్కడి రైతులందరికీ రుణాలు అందిస్తామని తెలిపారు. ఆధునిక పద్ధతుల ద్వారా రైతులు వ్యవసాయం చేయాలని, తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించేలాగా రైతులు పంటలు పండించాలని మల్లేపల్లి బుచ్చిరెడ్డి అన్నారు. పచ్చి రొట్టె, జనుము, జీలుగను వెయ్యాలని, ముఖ్యంగా రైతులు భూసార మట్టి నమూనాలు చేయించుకోవాలని అందుకు అధికారులు కూడా రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులోనే ఉంటున్నారని, ఈ సందర్భంగా బుచ్చిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ప్రసాద్, విద్యుత్తు ఏఈ సంతోష్ పవర్, వ్యవసాయ విస్తరణ అధికారి రాణి,రోజా, సొసైటీ డైరెక్టర్ మోహన్ రెడ్డి, సొసైటీ సీఈఓ బుచ్చి రాములు, రైతులు పాల్గొన్నారు.

## తాగునీటి సరఫరా సక్రమంగా జరిగేలా చర్యలు చేపట్టాలి

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**ఏఎస్ రావు నగర్, రాజముద్ర న్యూస్:** కాప్రా సర్కిల్ వ్యాప్త కాలనీలలో అంతరాయం లేకుండా నాణ్యంగా నీటి సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలనిషఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి జలమండలి అధికారులను ఆదేశించారు. మంగళవారం కుషాయిగూడ డివిజన్ పరిధిలోని కాలనీలలో గత 15 రోజులుగా అస్తవ్యస్తంగా నీటి సరఫరా జరుగుతుందని తాగేందుకు చుక్క నీళ్లు దొరక్క జనం అవస్థలు పడుతున్నారని వివరిస్తూ కాలనీ కమిటీల సమాఖ్య సిసిఎస్ ప్రతినిధులు మంగళవారం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బోర్లు ఎండి కుటుంబాలు నల్ల నీటిపైనే ఆధారపడి ఉన్నారన్న విషయాన్ని గుర్తెరిగి అంతరాయం లేకుండా నీటి సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలని జలమండలి డీజిఎం హర్షితకు సూచించారు. కుషాయిగూడ డీమార్ట్ దగ్గర లీకేజీ అయిన పైపులైన్ కు మరమ్మతులు చేయించి గతంలో మాదిరిగా నీటి సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ కమిటీల సమాఖ్య సిసిఎస్ అధ్యక్షులు ఎంపల్లి పద్మా రెడ్డి, నాయకులు నేమూరి మహేష్ గౌడ్, సిసిఎస్ ప్రతినిధులు గంప కృష్ణ, జై కృష్ణ, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుమలాయపాలెంలో ఘనంగా ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' అవగాహన సదస్సు



**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" కార్యక్రమం మరియు "రైతు వారోత్సవాల"లో భాగంగా మంగళవారం తిరుమలయపాలెం లో రైతులకు ఉద్యాన పంటలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సదస్సులో ముఖ్యంగా ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెంచడం, దాని ప్రాముఖ్యత, కూరగాయల సాగులో మెళకువలు మరియు సూక్ష్మ సేద్యం (డ్రిప్ ఇరిగేషన్) ద్వారా ఉద్యాన పంటల సాగు వల్ల కలిగే ప్రయోజనాలపై నిపుణులు రైతులకు వివరించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ అధికారి ఎం.వి. మధుసూదన్ మాట్లాడుతూ.. రైతులు సంప్రదాయ పంటల నుంచి లాభదాయకమైన ఉద్యాన పంటల వైపు మళ్లాలని కోరారు. ఆయిల్‌పామ్ సాగు ద్వారా దీర్ఘకాలిక ఆదాయం పొందవచ్చని సూచించారు. వ్యవసాయ జిల్లా ప్రత్యేక అధికారి శివానంద్ మరియు పాలేరు ఏడీఏ ఎం. సతీష్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ధరావత్ సుజాత , గోద్రెజ్ వైస్ చైర్మన్ చావా వెంకటేశ్వరరావు, శాస్త్రవేత్త జాముని రాణి, ఉద్యాన అధికారి పి. అపర్ణ, మండల వ్యవసాయ అధికారి ఎన్. సీతారామరెడ్డి ఆయిల్ ఫామ్ రైతులు తదితరులు పాల్గొన్నారు. వీరితో పాటు వివిధ డ్రిప్ ఆయిల్‌పామ్ కంపెనీల ప్రతినిధులు, మండలంలోని పెద్ద సంఖ్యలో రైతులు ఈ అవగాహన సదస్సులో భాగస్వాములయ్యారు

## జర్నలిస్ట్ మిత్రులకు హెల్మెట్స్ పంపిణీ..

సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహా..



**సూర్యాపేట, రాజముద్ర న్యూస్:** రోడ్డు ప్రమాదంలో ఎవరు ప్రాణాలు పోకూడదు ద్విచక్ర వాహనంపై ప్రయాణించేటప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని మంగళవారం ఎస్పి నర్సింహా సూచించారు. అరైవ్ అలైవ్ రోడ్డు భద్రతలో భాగంగా అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, రోడ్డు నివారించడంలో పోలీసు అనుక్షణం కృషి చేస్తున్నాం అని తెలిపారు. సూర్యాపేట ప్రింట్ ఎలక్ట్రానిక్ జర్నలిస్టుల సంక్షేమంలో భాగంగా జిల్లా పోలీస్ శాఖ తరపున సెవెన్ స్టార్ సోలార్ ఎంటర్ప్రైజెస్ వారి సౌజన్యంతో హెల్మెట్ పంపిణీ చేశారు. సమాజంలో జరుగుతున్న ప్రభుత్వ అభివృద్ధి అంశాలు, పోలీసు కార్యకలాపాలు, శాఖల కార్యకలాపాలు ఇతర అంశాల గురించి ఎప్పటికప్పుడు ప్రజలకు, సమాజానికి చేరవేయడంలో జర్నలిస్టులు అనుక్షణం పనిచేస్తున్నారని అన్నారు.ఎండ వాన చలి అనక పనిచేస్తున్న జర్నలిస్టుల సంక్షేమంలో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో హెల్మెట్స్ అందజేయడం జరిగిందని అన్నారు. ప్రయాణ సమయంలో ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించి ప్రమాదాల సమయంలో ప్రధాన రక్షణ పొందాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి రవీందర్ రెడ్డి,7 స్టార్ సోలార్ ఎంటర్ప్రైజెస్ అధికారి మల్లేష్, జర్నలిస్టు మిత్రులు పాల్గొన్నారు.

## ఉచిత వాటర్ సరఫరాపై ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కి వినతి పత్రం



**కీసర, రాజముద్ర న్యూస్:** కీసర సర్కిల్, నాగారం డివిజన్ లలో భూగర్భ జలాశయాలు కలుషితమవుతున్న సందర్భంగా మంచి నీటి కోసం 20వేలు లీటర్ వాటర్ ఉచిత సరఫరా పథకాన్ని కీసర సర్కిల్,నాగారం డివిజన్ కు వర్తింపజేయాలని చెప్పి హెచ్ఎండబ్ల్యుఎస్ అండ్ ఎస్ డి అధికారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ వాళ్ల కీసర సర్కిల్, నాగారం డివిజన్ భూగర్భ జలాశయాలు కలుషితమవుతున్నాయి. అలాగే వాతావరణం కూడా కలుషితం అవుతుందని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కి విన్నవించడం జరిగింది. ఆమె స్పందిస్తూ జూన్ మొదటి వారంలో ఈ సర్కిలను,డివిజన్లను హెచ్ఎండబ్ల్యుఎస్ అండ్ ఎస్ డి లో విలీనం చేసుకుంటామని చెప్పారు. అలాగే ఉచిత వాటర్ సరఫరా పథకాన్ని పై సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్ర రెడ్డి, బిజ్జ శ్రీనివాస్ గౌడ్, నక్క కిషోర్ గౌడ్, కృష్ణ చారి,రాజు గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

## కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో యువతి అదృశ్యం



**కుషాయిగూడ, రాజముద్ర న్యూస్:** పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కె.జ్యోతి, భర్త శ్రీనివాస్, నివాసం: సుల్తాన్‌షాహి, చార్మినార్, హైదరాబాద్ ఫిర్యాదు ప్రకారం వారి కుమార్తె శ్రావ్య (వయస్సు 18 సంవత్సరాలు) గత ఆరు నెలలుగా ఈసీఐఎల్ ప్రాంతంలో సాయి సుధీర్ డిగ్రీ కాలేజీ సమీపంలో తన అమ్మమ్మ వద్ద నివసిస్తున్నట్లు తెలిపారు. తేది 04.05.2026 న సాయంత్రం సుమారు 16:30 గంటలకు సమీపంలోని కంప్యూటర్ క్లాస్‌కు పుస్తకం ఇవ్వడానికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని తెలిపారు. కుటుంబ సభ్యులు అన్ని ప్రాంతాల్లో వెతికినప్పటికీ ఆమె గురించి ఎలాంటి సమాచారం లభించలేదు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగుతోందన్నారు.

## పట్టుదలతో శ్రమించి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలి



**ఘట్‌కేసర్, మే 05, రాజముద్ర న్యూస్:** పట్టుదల, క్రమశిక్షణతో శ్రమిస్తే రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు సాధ్యమవుతుందని ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు లింగాల భూపాల్ తెలిపారు. ఘట్‌కేసర్ పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని యామిని 10వ తరగతి ఫలితాలలో విశిష్ట ప్రతిభ కనబరిచి 576 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలవడంతో పాటు జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించింది. ఈ సందర్భంగా ఘట్‌కేసర్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో యామినిను ఘనంగా సన్మానించారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు లింగాల భూపాల్ నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో యామినికు రూ. 3,100/- నగదు బహుమానం అందజేయడంతో పాటు ఇంగ్లీష్-తెలుగు నిఘంటువు, భారత రాజ్యాంగం పుస్తకాన్ని బహుమతిగా అందించారు. ఆమె కృషి, పట్టుదల అభినందనీయం అని కొనియాడుతూ భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రతి విద్యార్థి యామినిను ఆదర్శంగా తీసుకుని క్రమశిక్షణతో చదివితే మంచి ఫలితాలు సాధించడం సాధ్యమే అని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కూడా పట్టుదలతో శ్రమిస్తే రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచగలరని పేర్కొన్నారు. మండల విద్యాధికారి రాములు మాట్లాడుతూ యామిని సాధించిన ఫలితం పాఠశాలకు గర్వకారణమని, ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయ మాట్లాడుతూ... ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం, తల్లిదండ్రుల ప్రోత్సాహం వల్లే ఈ విజయాన్ని సాధించగలిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడు కే. యాదగిరి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి ఎస్. నర్సింగ్ రావు, కోశాధికారి యల్. రాజు, సలహాదారులు ఎఫ్. రామకృష్ణ, వి. గోవింద్ రాజు, కే. నర్సింహ్మా, సభ్యులు నిరంజన్, కే. రమేష్, నామాల శ్రీనివాస్, జి సత్యనారాయణ, సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## గంగమ్మ తల్లి నూతన ప్రతిష్టాపన ఉత్సవాలు




**రామారెడ్డి రాజముద్ర న్యూస్ :** రామారెడ్డి మండలంలో గంగమ్మ తల్లి నూతన ప్రతిష్టాపన ఉత్సవాలు తేదీ 6 నుండి 9వ తేదీ వరకు ఉత్సవ కార్యక్రమాలు నిర్వహించబడతాయని గంగపుత్ర సంఘం రామారెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ, భక్తులు అధిక సంఖ్యలో వచ్చి గంగమ్మ తల్లి నూతన ప్రతిష్టాపన ఉత్సవ కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు.

# ఆర్థిక, రాజకీయ బలం లేకుండా సంఘ అభివృద్ధి అసాధ్యం

- నరసింహ రాజు
- భట్రాజు సంఘ అభివృద్ధికి యువతే కీలకం: నరసింహ రాజు పిలుపు
- ఆర్థిక, రాజకీయ శక్తితోనే సంఘం బలోపేతం సాధ్యం
- ప్రతి సభ్యుడికి గౌరవం సంఘ ఐక్యతే ప్రధాన బలం
- సంఘ సమావేశాల్లో చురుకైన పాల్గొనాలని నాయకుల విజ్ఞప్తి
- జొన్నలగడ్డ మూర్తి రాజు, ఓంకారం కీర్తి సంతోష్ రాజ్‌కు ఘన సన్మానం నాయకత్వానికి గుర్తింపు







**హైదరాబాద్ మే 05, రాజముద్ర న్యూస్:** భట్రాజు సంఘం అభివృద్ధి కోసం యువత ముందుకు రావాలని భట్రాజు సంఘం యువజన పూర్వ రాష్ట్ర అధ్యక్షులు నరసింహ రాజు పిలుపునిచ్చారు. సమాజంలో మార్పు తీసుకురావడంలో యువత పాత్ర అత్యంత కీలకమని, వారు రాజకీయంగా ఆర్థికంగా ఎదిగినప్పుడే సంఘం బలపడుతుందని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుత కాలంలో సంఘాల అభివృద్ధి కేవలం మాటల్లో కాకుండా, కార్యాచరణలో ప్రతిఫలించాలి అని ఆయన పేర్కొన్నారు. యువత తమ ప్రతిభను సమాజ సేవకు వినియోగించి, సంఘాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని సూచించారు. అలాగే విద్య, ఉపాధి, వ్యాపారం వంటి రంగాల్లో ఎదుగుదల సాధించడం ద్వారా సంఘానికి బలమైన ఆధారం కల్పించవచ్చని అన్నారు. సంఘంలో ప్రతి ఒక్కరికీ సమాన గౌరవం ఉండేలా నాయకత్వం వ్యవహరించాలనే అంశాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. చిన్న పెద్దా అనే తేడా లేకుండా అందరూ ఒకటిగా పనిచేస్తేనే సంఘం అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. పరస్పర గౌరవం, ఐక్యత, నిబద్ధత ఈ మూడు విలువలతోనే సంఘం బలపడుతుందని ఆయన అన్నారు. ఇక సంఘ కార్యక్రమాలు మరింత ప్రభావవంతంగా ఉండాలంటే సభ్యులంతా సమావేశాల్లో చురుకుగా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశాలు కేవలం చర్చలకే పరిమితం కాకుండా, నిర్ణయాలు తీసుకునే వేదికగా మారాలని, వాటి ద్వారా సంఘ అభివృద్ధికి దిశానిర్దేశం జరగాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ - 1 జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి జొన్నలగడ్డ మూర్తి రాజు, భట్రాజు సంఘం రాష్ట్ర నాయకులు ఓంకారం కీర్తి సంతోష్ రాజ్ ను ఘనంగా సన్మానించారు. సంఘానికి ఆయన అందించిన సేవలను కొనియాడుతూ, భవిష్యత్తులో కూడా ఆయన నాయకత్వం సంఘానికి మరింత బలాన్ని చేకూరుస్తుందని నాయకులు అభిప్రాయపడ్డారు. సంఘ అభివృద్ధి కోసం ప్రతి సభ్యుడు బాధ్యతగా ముందుకు రావాలని, వ్యక్తిగత విజయాన్ని సామూహిక అభివృద్ధిగా మార్చుకోవాలని కీర్తి సంతోష్ రాజ్ పిలుపునిచ్చారు. యువత, పెద్దలు, నాయకులు అందరూ కలిసికట్టుగా కృషి చేస్తే భట్రాజు సంఘం మరింత ఉన్నత స్థానాన్ని సాధించగలదని విశ్వాసం వ్యక్తం చేశారు.

## అఖిలభారత మహాసభల విజయవంతం కై ఉధృత ప్రచారం



**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** మే 11, 12,13 తేదీలలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందులో జరిగే అఖిలభారత ఐక్య రైతు సంఘం (ఏఐయుకేఎస్) మహాసభలను జయప్రదం చేయాలని★ . అఖిలభారత ఐక్య రైతు సంఘం(ఏఐయు కె ఎస్) తెలంగాణ రాష్ట్ర నాయకులు కమ్మ కోమటి నాగేశ్వర రావు మహాసభల విజయవంతం చేయాలని రాయల వెంకటనారాయణ భవనం ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలు గ్రామంలో గోడ పోస్టర్ ఆవిష్కరణ చేసినారు ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ దేశానికి అన్నం పెట్టే రైతు ప్రజల కడుపు నింపుతూ తను కష్టాల కొలిమిలో కాలుతున్నాడని అన్నారు. భూమిలో విత్తనం నాటిన నుండి పంట తోలుకొని మార్కెట్లో అమ్మే వరకు అడుగడుగునా దగాకు, దోపిడీకి గురవుతున్న ఏకైక వ్యవస్థ రైతుదేనని అన్నారు. పుండు మీద కారం చల్లిన చందంగా అతివృష్టి అనావృష్టిలతోపాటు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల రైతు వ్యతిరేక విధానాలు రైతులకు ఉరితాలుగా మారుతున్నాయని అన్నారు . విత్తనాలు,ఎరువులు, పురుగు మందులు కల్తీ, కూలీల కొరత, మార్కెట్లో దళారీల బెడద ఒకటేమిటి అన్ని రైతుకి ప్రతిబంధకాలేనని అన్నారు. అంతర్జాతీయ స్థాయిలోనే భారత వ్యవసాయ రంగం, రైతాంగం పట్ల కార్పొరేట్ శక్తుల కుట్రలు జరుగుతున్నాయని అన్నారు. మోడీ ప్రభుత్వం రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానని ఇచ్చిన హామీ విస్మరించి పంట గిట్టుబాటు ధర చట్టం చేయటం లేదన్నారు. ఎరువులకు విత్తనాలకు పురుగుమందులకున్న సబ్సిడీని పూర్తిగా రద్దుచేసి కంపెనీలకు స్వేచ్ఛనిస్తున్నారని విమర్శించారు. బ్యాంకులు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం అప్పులు ఇవ్వక ప్రైవేటు వడ్డీ వ్యాపారుల వద్ద రైతులు మోసపోతున్నారని అన్నారు. ఇంకా కౌలు రైతులు సమస్యలు చెప్పనలివి కాకుండా ఉన్నాయని అన్నారు. ఇంకా రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై ఇల్లందులో జరిగే అఖిల భారత ప్రథమ మహాసభలలో వివరంగా చర్చించనున్నామని అన్నారు. రైతు పక్షపాతి వడ్డే శోభనాదీశ్వరరావు, ప్రదీప్ సింగ్ ఠాకూర్,ఇల్లందు ఎమ్మెల్యే మాజీ గుమ్మడి నరసయ్య, పోటు రంగారావు అరుణ క్క తదితరులు హాజరు కానున్నారని అన్నారు. మొదటిరోజు బహిరంగ సభ ప్రదర్శన సుమారు 25 వేల మందితో జరగనుందని రెండవ రోజు ఎంపిక చేసిన ప్రతినిధులు 16 రాష్ట్రాల నుండి హాజరుకానున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత ఐక్య రైతు సంఘం నాయకులు వెంకటస్వామి. శంకర్. బొమ్మగాని వెంకన్న. ఎడ్లపల్లి నవీన్. విజయ్. వడ్లమూడి వెంకయ్య. పోతులూరి. తాత హనుమంత రావు. కాంపాటి రామారావు. నరసయ్య. తదితరులు పాల్గొన్నారు

## పది లో 530 మార్కులు సాధించిన ఓరగంటి యామిని

- కీసర మండలంలో ఓరగంటి యామిని మొదటి ర్యాంక్ సాధించడం గర్వకారణం
- మేడ్చల్ రూరల్ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు ఏనుగు రాజిరెడ్డి యామినిని సన్మానించారు

**కీసర, రాజముద్ర న్యూస్:** రాంపల్లి గ్రామానికి చెందిన ఓరగంటి బాలరాజు, స్వాతి దంపతుల కుమార్తె ఓరగంటి యామిని రాంపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతూ పదవ తరగతిలో 530 మార్కులు సాధించి కీసర మండలంలో మొదటి ర్యాంక్ సాధించడం గర్వకారణం. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మేడ్చల్ రూరల్ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు ఏనుగు రాజిరెడ్డి యామినిని సన్మానించారు. ఆమె విద్యాభ్యాసాన్ని ప్రోత్సహిస్తూ ఇంటర్ కాలేజ్‌కు సంబంధించిన పూర్తి ఫీజును తానే భరిస్తానని తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ.. యామిని చదువుకు తాను పూర్తిగా బాధ్యత తీసుకుంటానని, ఆమె ఉన్నత హోదాను సాధించే వరకు అండగా నిలుస్తానని తెలిపారు. యామిని భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగం సాధించి, రాంపల్లి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాగారం డివిజన్ బీజేపీ అధ్యక్షులు కొండబోయిన నాగరాజు యాదవ్, ఉపాధ్యక్షులు రామారం గిరి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# పారదర్శకతతో సంక్షేమ పథకాల అమలు..

- అభివృద్ధి..సంక్షేమమే మా తొలి ప్రాధాన్యత..
- పటాన్ చెరువు ఎమ్ ఎల్ ఎ గూడెం మహిపాల్ రెడ్డి.
- 226 మంది లబ్ధిదారులకు రెండు కోట్ల 26 లక్షల రూపాయల విలువైన కళ్యాణ లక్ష్మి..షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ..



**పటాన్ చెరువు రాజముద్ర న్యూస్ :** అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాల అందిస్తూ పూర్తి పారదర్శక పాలన అందిస్తున్నామని పటాన్ చెరువు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం పటాన్ చెరువు లోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో.. రామచంద్రాపురం, పటాన్ చెరువు, అమీన్పూర్ రెవెన్యూ మండలాల పరిధిలోని 226 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా మంజూరైన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం పేద, బడుగు, బలహీన వర్గాల కుటుంబాలకు ఆడపిల్ల పెళ్లి భారం కాకూడదన్న సమున్నత లక్ష్యంతో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ అని విప్లవాత్మక పథకాన్ని పెట్టారని గుర్తు చేశారు. పటాన్ చెరువు నియోజకవర్గం వ్యాప్తంగా ప్రజల సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు తొలి ప్రాధాన్యత ఇస్తూ ప్రజల ఆర్థిక అభ్యున్నతికి పాటుపడుతున్నట్లు తెలిపారు.. నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా శ్రీ కాలబైరవ స్వామి కి ప్రత్యేక పూజలు...

**రామారెడ్డి (రాజముద్ర.) న్యూస్**

రామారెడ్డి మండలం ఈసనపల్లి గ్రామంలో వెలిసిన శ్రీ కాలబైరవ స్వామికి మంగళవారం రోజున వైశాఖమాసం సందర్భంగా మూడవ మంగళవారం స్వామివారికి కూరగాయలచే అలంకారం చేశారు ఘనంగా సింధూర పూజలు నిర్వహించారు , ధూప దీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు , అభిషేకాలు,పూజారులు నిర్వహించారు, అనంతరం అన్నదాన కార్యక్రమం చేశారు, ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ప్రభు రామచంద్రం, ఆలయ చైర్మన్ చింతల శంకర్, డైరెక్టర్లు, అసిస్టెంట్ ఈవో లక్ష్మణ్, పంతులు శ్రీనివాస్ శర్మ, వంశీ శర్మ , నాగరాజు, ఆలయ సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు జూన్ 2 నాటికి ఇళ్ల స్థలాలు

*** జర్నలిస్టుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న సీఎం రేవంత్ రెడ్డికి, రాష్ట్ర ప్రభుత్వానికి టీ ఎస్ జే యు ప్రత్యేక కృతజ్ఞతలు..**



**హైదరాబాద్ రాజముద్ర న్యూస్:**

అక్రిడిటేషన్ల జారీతో పాటు, జూన్ 2 నాటికి ఇళ్ల స్థలాల కల సాకారం చేస్తున్న ప్రజా ప్రభుత్వానికి హర్షాతిరేకాలు.

తెలంగాణలో జర్నలిస్టుల చిరకాల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్న రాష్ట్ర ప్రజా ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి, రెవెన్యూ, ఐ అండ్ పి ఆర్ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కి, రాష్ట్ర మంత్రివర్గ సహచరులందరికీ తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ పక్షాన హృదయపూర్వక కృతజ్ఞతలు.

గత ప్రభుత్వాల హయాంలో గుర్తింపునకు నోచుకోక ఇబ్బందులు పడ్డ ప్రింట్, ఎలక్ట్రానిక్, కేబుల్ ఛానల్స్ జర్నలిస్టులకు, వెటరన్, ఫ్రీలాన్స్ జర్నలిస్టులకు జీవో 252 (జీవో252) ద్వారా అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేసే గొప్ప నిర్ణయం తీసుకున్నది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ప్రభుత్వం. గత ప్రభుత్వం కేవలం 23,352 మందికే అక్రిడిటేషన్లను పరిమితం చేయగా, ప్రస్తుత ప్రజా ప్రభుత్వం ఏకంగా 46,000 మందికి పైగా అర్హులైన జర్నలిస్టులందరికీ ఈ అవకాశాన్ని విస్తరించి దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది. మే 1న జిల్లాల్లో కలెక్టర్ల ద్వారా కార్డుల పంపిణీకి ఆదేశాలు జారీ చేయడం, దరఖాస్తులకు మే 10వ తేదీని తుది గడువుగా నిర్ణయించడం, అర్హులైన జర్నలిస్టులందరికీ మెరుగైన ఆరోగ్య, సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలు చేస్తామని ప్రకటించడం జర్నలిస్టులకు కొండంత భరోసాను ఇచ్చింది. ఏప్రిల్ 30తో ముగుస్తున్న బస్ పాస్‌ల గడువును పొడిగించడం ఎంతో ఊరటనిచ్చింది.

**ఫ్యూచర్ సిటీలో ఇళ్ల స్థలాలు - జూన్ 2 నాటికి పరిష్కారం**

దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కలను సాకారం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం వేస్తున్న అడుగులు చారిత్రాత్మకం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సచివాలయంలో వివిధ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీలతో సమావేశమై.. జూన్ 2వ తేదీ (తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం) నాటికి న్యాయపరమైన చిక్కుల్లేకుండా ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరిస్తామని ప్రకటించడం పట్ల టీ ఎస్ జే యు హర్షం వ్యక్తం చేస్తోంది. ప్రతిష్టాత్మకమైన ఫ్యూచర్ సిటీ లో ఎమ్మెల్యేలు, అధికారులతో పాటు జర్నలిస్టులకు కూడా స్థలాలు ఇస్తామని ముఖ్యమంత్రి సానుకూలంగా ఉండటం ఆయన దార్శనికతకు నిదర్శనం. గత 18 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న జవహర్‌లాల్ నెహ్రూ హౌసింగ్ సొసైటీ సహా ఇతర సొసైటీల సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించేందుకు, జర్నలిస్టు సంఘాల్లో సభ్యులు కాని అర్హులైన వారికి కూడా న్యాయం చేసేందుకు మంత్రి పొంగులేటి తీసుకుంటున్న చొరవ అభినందనీయం. అందరూ ఒకే వేదికపైకి వచ్చి జేఏసీగా ఏర్పడాలన్న మంత్రి సూచనను టీ ఎస్ జే యు స్వాగతిస్తోంది. ఈ నిర్ణయాలను క్షేత్రస్థాయిలో అమలు చేస్తున్న ఐ ఎన్ పి ఆర్ స్పెషల్ కమిషనర్ శ్రీ జి. ముకుంద రెడ్డి, మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి తదితర అధికారులకు మా ధన్యవాదాలు. జర్నలిస్టుల కష్టాలు తెలిసిన నాయకుడు సీఎం రేవంత్ రెడ్డి గత (బీఆర్ఎస్) ప్రభుత్వ హయాంలో పత్రికా స్వేచ్ఛను హరించి, జర్నలిస్టులను దునుమాడిన ప్రభుత్వ నియంతృత్వానికి వ్యతిరేకంగా.. నా (పురుషోత్తం నారగౌని) అధ్యక్షతన ఇందిరా పార్క్ వద్ద మహా ధర్నా నిర్వహించాము. ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్వయంగా ఆ ధర్నాకు హాజరై, మా పోరాటానికి, జర్నలిస్టులకు అండగా నిలబడ్డ వాస్తవాన్ని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాము. నాడు ప్రతిపక్ష నాయకుడిగా జర్నలిస్టుల కష్టాలను కళ్లారా చూసిన రేవంత్ రెడ్డి నేడు ముఖ్యమంత్రి హోదాలో జర్నలిస్టులకు ఈ ప్రయోజనాలను కల్పిస్తున్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి చిత్తశుద్ధితో అడుగులు వేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కి, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి,మంత్రివర్గ సభ్యులకు టీ ఎస్ జే యు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోంది.

## బాలికా సాధికారతే లక్ష్యాంగా స్నేహా సమ్మర్ క్యాంపు

*** జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్**




**జిల్లా కలెక్టరేట్, రాజముద్ర న్యూస్:**

బాలికా సాధికారతే లక్ష్యాంగా స్నేహా సమ్మర్ క్యాంపు ద్వారా కౌమార బాలబాలికల సమస్యల పరిష్కారం, పోషణ అవసరాలు, పిల్లల సంరక్షణ కౌమార బాలబాలికల సంఘాల ఏర్పాటు వంటి అంశాల పై అవగాహన కల్పించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ మిని మీటింగ్ హాల్ లో ఏర్పాటు చేసిన సమావేశానికి అదనపు కలెక్టర్ హాజరైనారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ స్నేహ సమ్మర్ క్యాంపులో బడి మానేసిన పిల్లలను తిరిగి బడికి పంపేలా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. బాల్య వివాహాల నిర్మూలన, బాల్య వివాహాల వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక ప్రభావాల పై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఆరోగ్య మేళా ద్వారా బాలికల ఆరోగ్య సమస్యల పై,రక్తహీనత పై అవగాహన కల్పించాలన్నారు. పిల్లల వ్యక్తిగత శుభ్రత, సామూహిక అవసరాలు ఆరోగ్యం పై అవగాహన కల్పించాలన్నారు. బాలికలకు సురక్షిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు గ్రామస్థాయిలో సమస్యలను గుర్తించి గ్రామ భద్రతా ప్రణాళిక తయారు చేయాలని తెలిపారు. బాలికల భద్రత పై, బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించాలన్నారు. బాలికలకు ఆర్థిక నిర్వహణ కల్పించడానికి బ్యాంకు ఖాతాలు, పొదుపు అలవాటు వంటి వాటి పై వారికి అవగాహన కల్పించాలన్నారు. శారీరక వ్యాయమం ప్రాముఖ్యత తెలుపుతూ క్రీడలు,యోగా, పాటలు నృత్యం ద్వారా వారిలోని ప్రతిభను గుర్తించాలన్నారు. విద్య ప్రాముఖ్యత, కెరీర్ కు అవసరమైన మార్గదర్శకాలు అందించాలన్నారు. మొబైల్ వినియోగంలో జాగ్రత్తలు, సైబర్ భద్రత, చెడు భాష వాడకూడదు వ్యక్తిగత సమాచారం రహస్యంగా ఉంచడం వంటి వాటి పై వారికి ప్రత్యేక శిక్షణ ఇప్పించాలన్నారు. సైక్లింగ్, ద్విచక్రవాహన శిక్షణ వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. తల్లిదండ్రుల పట్ల కృతజ్ఞతా కార్యక్రమాలు, పిల్లల గ్రామ సభలు ఏర్పాటు వంటి కార్యక్రమాలను ప్రవేశ పెట్టాలన్నారు. అంగన్ వాడీ ఆశా వర్కర్లతో గ్రామాలలో అవగాహన కార్యక్రమాలను ఎర్పాటు చేయాలన్నారు. బాల్య వివాహాల వ్యతిరేక తీర్మాణం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ సాంబశివరావు, జిల్లా మైనార్టీ అధికారి కాంతమ్మ, డిఈఓ విజయ కుమారి, డిఎం అండ్ హెచ్ఓ ఉమా గౌరి, డిడబ్ల్యూఓ సిబ్బంది, మండల విద్యాధికారులు, డిపిఎంలు ఆనంద్, వినత, ఎపిఎంలు పాల్గొన్నారు.

# ప్రజా నేతకు నీరాజనం:

## ఘనంగా రాయల నాగేశ్వరావు పుట్టినరోజు వేడుకలు

**ఖమ్మం, రాజముద్ర న్యూస్**

రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు పుట్టినరోజు వేడుకలు నేలకొండపల్లి మండల కేంద్రంలో అత్యంత వైభవంగా జరిగాయి. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఈ సంబరాలు కార్యకర్తలు, అభిమానుల కోలాహలం మధ్య పండుగ వాతావరణాన్ని తలపించాయి.

**ఘనంగా కేక్ కటింగ్.. మిఠాయిల పంపిణీ.**

మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో జరిగిన ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నుపూసల సీతారాములు ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా రాయల నాగేశ్వరరావుకు మద్దతుగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు.

**ప్రజా నాయకత్వానికి ప్రశంసలు.**

ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. రాయల నాగేశ్వరరావు సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గిడ్డంగుల సంస్థ చైర్మన్ బాధ్యతలు చేపట్టిన నాటి నుండి, కొత్త గోదాముల నిర్మాణానికి శ్రీకారం చుడుతూ సంస్థను పటిష్టమైన మార్గంలో నడిపిస్తున్నారని వారు కొనియాడారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేసే రాయల నాగేశ్వరరావు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, భవిష్యత్తులో ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం ఆయనకు కలగాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నుపూసల సీతారాములుతో పాటు, యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి జెర్రిపోతుల అంజనీ, ఎస్సీ విభాగం అధ్యక్షులు బొడ్డు బొందయ్య, రేగురి వాసవి, జెర్రిపోతుల సత్యనారాయణ, రాయగూడెం సర్పంచ్ బోయిన వేణు పాల్గొన్నారు. అలాగే మామిడి వెంకన్న, దోసపాటి శేఖర్, పలపటి సురేష్, బాబు రెడ్డి, అదం, మస్తాన్, గుడ్డి బోయిన వెంకటేశ్వర్లు, గొలుసు పవన్, సోమనబోయిన సాయి నవీన్, గట్టిగొండ్ల విజయ్, సైదులు, నోషిన్ లక్ష్మయ్య, వడ్డే జగన్, గండు జానయ్య, రాయపూడి రోహిత్, మన్నే నరేష్, కోడిరేకుల వినోద్, ఊటుకూరి రమేష్, చీరాల అంజి బాబు, నాగేశ్వరరావు, రమేష్, కొమనబోయిన సీత, పసుపులేటి ఉపేందర్, మెల్లచెరువు నాగేశ్వరరావు, అనంతు సత్యనారాయణ, మారుతి వెంకట రామయ్య, బచ్చలకూరి నాగేశ్వరరావు, కొత్తపల్లి వెంకటేశ్వర రావు, షేక్ మహమ్మద్ పాషా, మారుతి భరత్ కుమార్, షేక్ శిలర్, కొత్తపల్లి సాయి, బచ్చలకూరి వంశీ తదితర గ్రామ సర్పంచులు, వార్డు సభ్యులు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## చలివేంద్రాలు..దప్పిక తీర్చే కల్పవృక్షాలు...

**కుషాయిగూడ, రాజముద్ర న్యూస్:**

ప్రజలకు వేసవికాలంలో దాహార్తిని తీర్చేందుకు ఈసీఐఎల్ లోని శ్రీ సత్య సాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో గత 20 ఏళ్లుగా రహదారి బాటసారుల దాహార్తిని తీరుస్తూ ప్రజల అభిమానుల ఆదర అభిమానాన్ని చూరగొంటుంది. ఈ సందర్భంగా ఈసీఐఎల్ చౌరస్తాలోని టెర్మినల్ వద్ద మంగళవారం శ్రీ సత్య సాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో బాటసారులకు అన్నపూర్ణా, సుదర్శన్ రావు తదితరుల ఆధ్వర్యంలో బాటసారులకు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యసాయి సేవా సమితి సభ్యుడు సుదర్శన్ రావు మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా శ్రీ సత్యసాయి సేవాసమితి ఎలాంటి లాభాపేక్ష లేకుండా నిస్వార్థంగా నిరాడంబరంగా ప్రజల దాహార్తిని తీర్చడమే అంతిమ లక్ష్యంగా పనిచేస్తుందని తెలిపారు . వేసవికాలం వచ్చిందంటే చాలు సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రధాన రహదారులపై చలివేంద్రాలను ఏర్పాటు చేసి త్రాగునీరు మజ్జిగ ఇతర దాహార్తి పానీయాలను అందిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో అన్నపూర్ణ, సుభాషిని ,శేషగిరిరావు, కేబుల్ ఆపరేటర్ రమేష్ తదితరుల ఆధ్వర్యంలో ఈ పుణ్యకార్యము మూడు నెలలుగా యధావిధిగా జరుగుతుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు దామరపల్లి నర్సింహా రెడ్డి, పందిరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు



## ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి..

**జగిత్యాల, రాజముద్ర న్యూస్:**

జగిత్యాల జిల్లాలో ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లాలో రబీ ధాన్యం కొనుగోలుపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. సమీక్ష సమావేశంలో కలెక్టర్ సత్యప్రసాద్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, అడిషనల్ కలెక్టర్ లత, జగిత్యాల జిల్లా అడిషనల్ ఎస్పీతో పాటు జిల్లాలోని చైర్మన్ మార్కెట్ కమిటీ చైర్మన్లు, రైస్ మిల్లర్లు, వివిధ శాఖల అధికారులు, ట్రాన్స్ పోర్ట్ నిర్వాహకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ఏడాది రబీ సీజన్లలో జగిత్యాల జిల్లాలో పెద్ద ఎత్తున ధాన్యం దిగుబడులు వచ్చాయని అన్నారు. రైతులు పండించిన ధాన్యం కొనుగోలుకు ఇప్పటికే ప్రభుత్వం తరపున అన్ని ఏర్పాట్లు చేశామని మంత్రి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పెట్టిన కొన్ని షరతుల వలన కొనుగోలు జాప్యం జరిగిందని మంత్రి అడ్లూరి అన్నారు.జిల్లాలో ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని అధికారులు సమన్వయం చేసుకొని కొనుగోలులో, ధాన్యం తరలింపులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

రాజముద్ర
తెలుగు దిన పత్రిక

# బాలీవుడ్‌లో సత్తా చాటలేకపోతున్న సౌత్ స్టార్స్..

ఇక్కడ టాప్ పొజిషన్.. హిందీలో ఫ్లాపులు



## ఉత్తరాది కథానాయికల ముందు తేలిపోతున్న దక్షిణాది భామలు

సౌత్ ఇండియాలో స్టార్ హోదాను అనుభవిస్తున్న హీరోయిన్లు హిందీ తెరపై మాత్రం తమ మ్యాజిక్‌ను రిపీట్ చేయలేకపోతున్నారు. ఒకప్పుడు శ్రీదేవి, జయప్రద వంటి నటీమణులు బాలీవుడ్‌ను చాలా కాలాం ఏలారు. కానీ ప్రస్తుత తరం దక్షిణాది తారలకు అక్కడ అడుగుపెట్టడం సులభమైనా సెటిల్ అవ్వడం మాత్రం కత్తిమీద సాములా మారింది. స్టార్ ఇమేజ్ ఉన్నప్పటికీ హిందీలో వరుస ఫ్లాపులు పలకరిస్తుండటం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఫిదా బ్యూటీ సాయి పల్లవి బాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది. అమీర్ ఖాన్ కుమారుడు జునైద్ ఖాన్ సరసన ఆమె నటించిన 'ఏక్ దిన్' చిత్రం మే 1, 2026న విడుదలైంది. అయితే ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఘోరంగా విఫలమైంది. మొదటి మూడు రోజుల్లో ఈ చిత్రం కనీసం రూ. 3 కోట్ల రూపాయల వసూళ్లను కూడా రాబట్టలేకపోయింది. క్రిటిక్స్ సాయి పల్లవి నటనను మెచ్చుకున్నప్పటికీ కమర్షియల్‌గా ఈ సినిమా డిజాస్టర్‌గా నిలిచింది. చందమామ కాజల్ అగర్వాల్ దక్షిణాదిలో ఎన్నో ఏళ్లుగా స్టార్‌గా ఉన్నప్పటికీ హిందీలో మాత్రం సరైన బ్రేక్ దక్కించుకోలేకపోయింది. అజయ్ దేవగన్ సరసన 'సింగం' వంటి హిట్ ఉన్నా ఆ క్రేజ్ నిలవలేదు. ప్రస్తుతం కాజల్ 'ది ఇండియా స్టోరీతో పాటు 'రామాయణ్' చిత్రాలతో తన అదృష్టాన్ని పరీక్షించుకుంటోంది. ఇక చెన్నై చిన్నది త్రిష పరిస్థితి కూడా భిన్నంగా లేదు. అక్షయ్ కుమార్ సరసన 'కట్టా మీటా'తో ఎంట్రీ ఇచ్చి ఆ ఒక్క సినిమాతోనే బాలీవుడ్‌కు దూరమైంది. బుట్టబొమ్మ పూజా హెగ్డేకు హిందీలో హృతిక్ రోషన్, సల్మాన్ ఖాన్ వంటి స్టార్లతో నటించే అవకాశం వచ్చినా 'మొహెంజదారో', 'కిసీ కా భాయ్ కిసీ కీ జాన్' వంటి చిత్రాలు ఫ్లాప్ అవ్వడం ఆమె కెరీర్‌పై ప్రభావం చూపింది. తమన్నా, శ్రియ శరణ్ వంటి నటీమణులు బాలీవుడ్‌లో పదే పదే ప్రయత్నిస్తున్నా.. అక్కడ 'స్టార్' హోదాను మాత్రం అందుకోలేకపోతున్నారు.

## సబ్ స్క్రిప్షన్ ట్రెండ్ నూ వదలని జక్కన్న..

### ఇదెక్కడి మాస్ ప్లాన్ అయ్యా!

బాహుబలి, RRR సినిమాలతో ఇండి యన్ సినిమా స్థాయిని ప్రపంచ దేశాలకు పరిచయం చేసిన ఈ జక్కన్న, ఇప్పుడు సూపర్‌స్టార్ మహేష్ బాబుతో తెరకె క్కిస్తున్న 'వారణాసి' కోసం అంతకు మించిన ప్లాన్‌తో రంగంలోకి దిగుతున్నా రు.ఈ సినిమాకు సంబంధించి సోషల్ మీడియాలో తాజాగా ఒక ఆసక్తికరమైన వార్త చక్కర్లు కొడుతోంది అదేమంటే ఈ మెగా ప్రాజెక్ట్ కోసం రాజమౌళి ఒక వినూ త్నమైన మార్కెటింగ్ స్ట్రాటజీని అమలు చేయ బోతున్నట్లు తెలుస్తోంది. ఈ మధ్య కాలంలో బాగా వైరల్ అయిన సబ్ స్క్రిప్షన్ ట్రెండును రాజ మౌళి ఇప్పుడు తనకు అనుకూలంగా వాడుకున్నట్టున్నట్లు తెలు స్తోంది. సాధారణంగా ఏదైనా సినిమాకు సంబంధించిన మేకింగ్ వీడియోలు, షూటింగ్ విశేషాలు లేదా నటీనటుల ఇంట ర్వ్యూలు సినిమాని ప్రమోట్ చేసుకోవ డానికి వాడుకుంటారు కాబట్టి దాదాపుగా అవన్నీ ఉచితంగానే దొరుకుతాయి.కానీ, 'వారణాసి' విషయంలో రాజ మౌళి రూటు మార్చారు. ఈ సినిమా వెనుక ఉన్న కష్టాన్ని, తెర వెనుక జరిగే ఆసక్తికరమైన BTS Videos వీక్షిం చాలనుకునే అభిమానుల కోసం రూ. 199 ధరతో ఒక ప్రత్యేక ప్యాకేజీని తీసుకు రానున్నట్లు సమాచారం. ఈ ప్యాకేజీలో మహేష్ బాబు, ప్రియాంక చోప్రాలకు సం బంధించిన ఎక్స్‌క్లూజివ్ ఫోటోలు., సినిమా కోసం వారు పడుతున్న శ్రమను వివరించే బిహైండ్ ది సీన్స్ వీడియోలు, పృథ్వీరాజ్ సుకుమారన్ వంటి స్టార్ కాస్ట్‌తో ప్రత్యేక ఇంటర్వ్యూలు, ప్రేక్షకులకు ఎక్కడా దొరకని కొన్ని ఆసక్తికరమైన 'టెడ్ బిట్స్' వంటి వాటిని ఉంచబోతున్నారు

## కామాక్షి షాకింగ్ డెసిషన్.. కెరీర్ పీక్‌లోనే నటనకు తాత్కాలిక విరామం



: టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యంగ్ టాలెంట్ కామాక్షి భాస్కర్ల ఊహించని నిర్ణయంతో సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. వరుస అవకాశాలతో కెరీర్ జోరుగా సాగుతున్న వేళ, కొంతకాలం పాటు నటనకు మరియు కెమెరాకు దూరంగా ఉండాలని ఆమె ప్రకటించడం అభిమానులను ఆశ్చర్యానికి గురి చేసింది.'మా ఊరి పొలిమేర' చిత్రంతో డీ-గ్లామర్ పాత్రలో ప్రేక్షకులను ఆకట్టుకున్న కామాక్షి, ఆ తర్వాత గ్లామరస్ పాత్రలతోనూ తన ప్రత్యేకత చాటుకుంది. సోషల్ మీడియాలోనూ మంచి ఫాలోయింగ్ సంపాదించుకున్న ఆమె, ఇటీవల అడివి శేష్ నటించిన 'డెకాయిట్' చిత్రంలోనూ తన నటనతో ప్రశంసలు అందుకుంది. ప్రస్తుతం 'అగధ', 'మా ఊరి పొలిమేర-3' వంటి ప్రాజెక్టులతో బిజీగా ఉన్న సమయంలో ఈ నిర్ణయం తీసుకోవడం మరింత ఆసక్తి రేకెత్తిస్తోంది.తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఈ విషయాన్ని వెల్లడించిన కామాక్షి, నటనపై విసుగు వల్ల కాకుండా మానసిక ఆరోగ్యం, స్వీయ సంరక్షణ కోసం ఈ బ్రేక్ తీసుకుంటున్నట్లు స్పష్టం చేసింది. జీవితంలో కొన్నిసార్లు మరింత బలంగా ముందుకు సాగేందుకు కాసేపు ఆగి మనసును సమతుల్యం చేసుకోవాల్సిన అవసరం ఉంటుందని పేర్కొంది. తనకు ప్రస్తుతం ప్రశాంతత అవసరమని, ఇది శాశ్వత విరామం కాదని.. మరింత ఉత్సాహంతో తిరిగి వస్తానని తెలిపింది.సినీ పరిశ్రమలో నిరంతర ఒత్తిడి మధ్య వ్యక్తిగత ఆరోగ్యాన్ని ముందుకు పెట్టి ఇలాంటి నిర్ణయం తీసుకోవడం అరుదుగా కనిపిస్తుంటుంది. దీంతో కామాక్షి నిర్ణయాన్ని పలువురు నెటిజన్లు అభినందిస్తున్నారు. ఆరోగ్యం ముఖ్యమని, మరింత బలంగా తిరిగి రావాలని అభిమానులు సోషల్ మీడియాలో మద్దతు తెలుపుతున్నారు.కెరీర్ కంటే మానసిక ప్రశాంతతకే ప్రాధాన్యత ఇచ్చిన కామాక్షి నిర్ణయం ఇప్పుడు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. వ్యక్తిగత శ్రేయస్సు కోసం తీసుకున్న ఈ అడుగు, గ్లామర్ ప్రపంచంలో కొత్త చర్చకు తెరలేపింది.



## కొత్త బంధాలపై తమన్నా వ్యాఖ్యలు

ప్రేమ, వ్యక్తిగత బంధాలపై నటి తమన్నా భాటియా చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం నెట్టింట చర్చనీయాంశంగా మారాయి. ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె, ప్రేమ అనేది జీవితంలో ఒక్కసారి మాత్రమే జరగాల్సిన అవసరం లేదని స్పష్టం చేస్తూ తన అభిప్రాయాలను వ్యక్తం చేశారు. మనసుకు నిజంగా నచ్చిన వ్యక్తి దొరికే వరకు కొత్త బంధాలను వెతుక్కోవడంలో తప్పులేదని తమన్నా అన్నారు. ప్రతి సంబంధం మన జీవితానికి ఏదో ఒక పాఠాన్ని నేర్పుతుందని, ఆ అనుభవాలు వ్యక్తిగత ఎదుగుదలకు దోహదపడతాయని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రేమలో ఉన్నప్పుడు అది ఇద్దరికీ ఆనందాన్ని, ఎదుగుదలను ఇవ్వాలి గానీ, ఒకరిపై ఒకరు ఆధిపత్యం చెలాయించేలా మారకూడదని ఆమె స్పష్టం చేశారు. అలాగే ప్రేమను ఒక లావాదేవీలా చూడకూడదని తమన్నా పేర్కొన్నారు. ఎదుటివారి నుంచి ఏదైనా ఆశించడం మొదలైతే అది నిజమైన ప్రేమ కాకుండా వ్యాపార సంబంధంలా మారిపోతుందని ఆమె అభిప్రాయపడ్డారు. నిజమైన ప్రేమ అనేది స్వేచ్ఛ, పరస్పర గౌరవం, అర్థం చేసుకోవడం వంటి విలువలపై నిలబడాలని ఆమె తెలిపారు.ఇటీవల ఆమె వ్యక్తిగత జీవితంపై వస్తున్న పుకార్ల నేపథ్యంలో చేసిన ఈ వ్యాఖ్యలు మరింత ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ముఖ్యంగా సంబంధాలపై ఆమె వ్యక్తపరిచిన స్పష్టమైన అభిప్రాయాలు యువతలో చర్చకు దారితీస్తున్నాయి.

## 'కల్కి-2'లో సాయి పల్లవి?



కల్కి 2898 ఏడి చిత్రంతో ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ప్రభాస్ ఇప్పుడు ఆ సినిమాకు రాబోయే రెండో భాగంపై అందరి దృష్టి నిలిచింది. దర్శకుడు నాగ్ అశ్విన్ రూపొందిస్తున్న ఈ భారీ సీక్వెల్‌కు సంబంధించి తాజాగా ఒక ఆసక్తికరమైన వార్త సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. ఈ సీక్వెల్‌లో సహజ నటిగా పేరు తెచ్చుకున్న సాయి పల్లవి కీలక పాత్రలో కనిపించనున్నట్లు గట్టిగా ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే మొదటి భాగంలో పలువురు స్టార్ నటీనటులు మెరిసిన నేపథ్యంలో, రెండో భాగంలో మరింత బలమైన పాత్రలను జోడించేందుకు దర్శకుడు ప్రయత్నిస్తున్నాడని సమాచారం. ఈ నేపథ్యంలో సాయి పల్లవి ఎంట్రీ ఉంటే, కథలో భావోద్వేగ గాఢత మరింత పెరుగుతుందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. ఒకవేళ ఈ వార్త నిజమైతే, ప్రభాస్--సాయి పల్లవి కలయికను తెరపై చూడటం అభిమానులకు ప్రత్యేక ఆకర్షణగా మా-రనుంది. మొత్తానికి, 'కల్కి-2'లో సాయి పల్లవి నటిస్తుందా లేదా అన్నదానిపై అధికారిక ప్రకటన రాకపోయినా, ఈ వార్తతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.

## ఫౌజీ చిత్రబృందానికి ప్రమాదం

**హైదరాబాద్, మే 5 :** పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న 'ఫౌజీ' సినిమా చిత్రబృందానికి విషాదం చోటుచేసుకుంది. హైదరాబాద్ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, పలువురు గాయపడిన ఘటన సినీ వర్గాలను కలచివేసింది. దర్శకుడు హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న ఈ భారీ చిత్రం షూటింగ్ వేగంగా కొనసాగుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. అబ్దుల్లాపూర్‌మెట్ సమీపంలో చిత్రబృందం ప్రయాణిస్తున్న వాహనం అదుపు తప్పి రోడ్డుపక్కన ఉన్న డివైడర్‌ను ఢీకొట్టినట్లు సమాచారం. ఈ ఘటనలో ప్రొడక్షన్ విభాగానికి చెందిన ఒక వ్యక్తి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని వెంటనే సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనతో చిత్రబృందం, అభిమానులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. షూటింగ్ పనుల నిమిత్తం బయలుదేరిన సమయంలోనే ఈ ప్రమాదం జరగడం మరింత విషాదాన్ని మిగిల్చింది. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ భారీ వ్యయంతో






నిర్మిస్తోంది. సినిమాలో ప్రభాస్ సరసన ఇమాన్వీ కథానాయికగా నటిస్తుండగా, మిథున్ చక్రవర్తి, జయప్రద, అనుపమ్ ఖేర్, రాహుల్ రవింద్రన్ వంటి ప్రముఖులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వ్యక్తి కుటుంబానికి సంతాపం తెలియజేసిన చిత్రబృందం, వారికి ఆర్థిక సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం. ప్రస్తుతం గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు.

Printed, Published and Owned by RAVU RAJITHA, Printed at KAKATHIYA PRINTERS, LN Colony, Uppal IDA, Uppal. Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, RNI NO : TELTEL/2024/86684, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com